Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 169 | హైదరాబాద్ | బుధవారం 13 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## అజ్ఞాతం వీడిన మావోయిస్టు అగ్రనేత నరహరి!

భార్య పూనమ్‌తో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుబాటు

నరహరిపై రూ.25 లక్షల రివార్డు

హైదరాబాద్, మే 12 (ప్రజాతీర్పు):

మావోయిస్టు అగ్రనేత పసునూరి నరహరి ఎలియాస్ విశ్వనాథ్ ఎలియాస్ సంతోష్ (61) అడవిబాట వీడారు. అజ్ఞాతంలోనే ఉన్న తన భార్య పూనమ్ ఎలియాస్ జోబాతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన నరహరి 1982లో వరంగల్ ఎల్‌బీ కాలేజ్‌లో డిగ్రీ చదివే సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయనపై రాష్ట్రంలో రూ.25 లక్షల మేర రివార్డుంది. ప్రస్తుతం బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ (బీజేఎస్ఏసీ) ఇన్‌ఛార్జిగా, ఈస్ట్ రీజినల్ బ్యూరో (ఈఆర్‌బీ) ఇన్‌ఛార్జిగా, ఝార్ఖండ్ టెక్నికల్ డివిజన్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నట్లు నిఘావర్గాల వద్ద సమాచారముంది. ఆంధ్రప్రదేశ్‌లోని

- మిగతా 2వ పేజీలో



# ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

## పాలన చేతకాక కాంగ్రెస్ క్రమంగా కనుమరుగవుతోంది

- బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం
- పార్టీ ముఖ్యులతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ప్రజలతో మమేకమై పనిచేయాలని పిలుపు
- డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదుకు ఆదేశం
- జిల్లాల వారీగా ఇన్‌చార్జీల నియామకం

**రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలనపై జనంలో తీవ్ర అసంతృప్తి ఉందని చెప్పారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీ నేతలు ఇంటికి పరిమితం కాకుండా నిరంతరం ప్రజాక్షేత్రంలో జనంతో మమేకమవ్వాలని పిలుపునిచ్చారు.**

హైదరాబాద్, మే 12 (ప్రజాతీర్పు):

రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలనపై జనంలో తీవ్ర అసంతృప్తి ఉందని చెప్పారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో వంద శాతం తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీ నేతలు ఇంటికి పరిమితం కాకుండా నిరంతరం ప్రజాక్షేత్రంలో జనంతో మమేకమవ్వాలని పిలుపునిచ్చారు. మంగళవా రం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ అధ్యక్ష తన పార్టీ కీలక సమావేశం జరిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీమంత్రి హరీశ్‌రావుతో పాటు శాసనసభ, శాసన మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. సుమారు 7 గంటల పాటు సాగిన సమావేశంలో కేసీఆర్ కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న రాజకీయ పరిస్థితులను విశ్లేషించారు. పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణానికి సంబంధించి నేతలకు దిశా నిర్దేశం

- మిగతా 2వ పేజీలో



-2వ

## 'నీట్' పరీక్ష రద్దు

- పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ నిర్ణయం
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడి..
- త్వరలో పరీక్ష తేదీ ప్రకటన.. మళ్లీ అడ్మిట్ కార్డులు
- రుసుము చెల్లించకుండా మరోసారి పరీక్షకు..
- లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశం
- మాస్టర్‌మైండ్ సహా 20 మందిని అదుపులో తీసుకున్న రాజస్థాన్ ఎస్‌ఓజీ
- గెస్ పేపర్‌లోని ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంలో..
- పరీక్షకు 15 రోజుల ముందే అభ్యర్థులకు గెస్ పేపర్



## హిమంత అనే నేను!

- అసోం సీఎంగా ప్రమాణ స్వీకారం
- మంత్రివర్గంలో నలుగురికి చోటు
- వేడుకకు హాజరైన ప్రధాని మోదీ

దిస్పూర్, మే 12: అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం గౌహతిలోని ఖానాపారా వెటర్నరీ కళాశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు హాజరయ్యారు. హిమంతతో అసోం గవర్నర్ లక్ష్మణ్ ఆచార్య పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. సీఎంతోపాటు నలుగురు మంత్రులు బీజేపీకి చెందిన రామేశ్వర్ తేలి, అజంతా నియోమ్, ఏజీపీకి చెందిన అతుల్ బోరా, బీపీఎఫ్‌కు చెందిన చరణ్ బోరో అనే నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా

- మిగతా 2వ పేజీలో

# ట్రాఫిక్ ఫ్రీ సిటీ!

## కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ 2050

## రూ. 4 లక్షల కోట్లతో భారీ ప్లాన్

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా )

హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సవాళ్లను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ 2050 పేరిట రూ. 4 లక్షల కోట్ల భారీ వ్యూహాన్ని ఖరారు చేసింది. భాగ్యనగరం ట్రాఫిక్ చిక్కుల్లో బెంగళూరును మించిపోతోందన్న విమర్శలు వస్తున్న సమయంలో నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ సిటీ గా మార్చేందుకు ఈ మెగా ప్లాన్ సిద్ధమైంది. మెట్రో రైలు నెట్‌వర్క్‌ను ప్రస్తుతం ఉన్న స్థాయి నుంచి 2050 నాటికి 556 కిలోమీటర్లకు విస్తరించడం, ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌ను 336 కిలోమీటర్లకు పెంచడం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశాలు. ట్రాఫిక్ సమస్యలు రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారుతాయన్న నిపుణుల హెచ్చరిస్తున్నారు. అందుకే ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై దృష్టి సారించింది. కేవలం రహదారుల వెడల్పుతోనే సమస్య పరిష్కారం కాదని గుర్తించిన సర్కారు.. అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు , ఎలివేటెడ్ కారిడార్ల మేళవింపుతో కూడిన మల్టీ-మోడల్ రవాణా వ్యవస్థను తెరపైకి తెచ్చింది. ముఖ్యంగా ఐటీ కారిడార్, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక బస్ లేన్లు, బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కోసం సుమారు 48 కిలోమీటర్ల మేర కారిడార్లను ఈ ప్లాన్‌లో ప్రతిపాదించారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ నిలకడగా ఉండాలంటే మెరుగైన కనెక్టివిటీ తప్పనిసరి. అందుకే మూడో దశ మెట్రో విస్తరణలో భాగంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి కొత్తగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను అనుసంధానించాలని నిర్ణయించారు. దీనికి తోడు నగరం చుట్టూ ఉన్న ఏడు ప్రధాన ప్రాంతాల్లో ఇంటర్-స్టేట్ బస్



టెర్మినల్స్, ట్రక్ టెర్మినల్స్ నిర్మించడం ద్వారా నగరంలోకి భారీ వాహనాల రాకను నియంత్రించి, అంతర్గత రహదారులపై ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2050 విజన్‌తో రూపొందించిన ఈ ప్రణాళికలు సకాలంలో అమలుకు నోచుకుంటేనే హైదరాబాద్ తన పెట్టుబడుల ఆకర్షణను నిలబెట్టుకోగలదు. ఇప్పటికే బెంగళూరు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల లోపాలను పాఠాలుగా తీసుకుని, హైదరాబాద్ లో అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం ట్రాన్సిట్ ఫస్ట్ విధానాన్ని వేగంగా అమలు చేయాల్సి ఉంది.

# ఒంటరైన బండి..!

- కుమారుడి వివాదంలో..
- కలిసిరాని కాషాయ ఎంపీలు
- దూరం పాటిస్తున్న నాయకులు
- కేంద్రమంత్రికి ఊహించని సంక్షోభం

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)



'ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. నిజానిజాలు కోర్టులు తేలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం. చట్టానికి కట్టుబడి ఉన్నా' కరీంనగర్ ఏక్తాయాత్రలో కేంద్ర మంత్రి బండి సంజయ్ భావోద్వేగంతో చేసిన వ్యాఖ్యలివి. బీజేపీలో సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన బండి సంజయ్ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా, బీజేపీ ఫైర్‌బ్రాండ్ నాయకుడిగా రాజకీయ ప్రస్థానంలో ఇప్పుడు ఒక ఊహించని సంక్షోభం ఎదురైంది. కింది స్థాయి నుంచి కౌన్సిలర్‌గా, ఎంపీగా, ఆపై కేంద్ర మంత్రిగా ఎదిగిన ఒక బలమైన బీసీ నేతకు తన కుమారుడి వ్యవహారశైలి ఇప్పుడు రాజకీయంగా పెద్ద తలనెప్పుగా మారింది. రాజకీయాల్లో స్వయంకృషితో ఎదిగిన నాయకులు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో బండి సంజయ్ కుమార్ ఒకరు. మున్సిపల్ కౌన్సిలర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీకి ఊపిరిపోసి, నేడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఎదిగిన ఆయన.. ఇప్పుడు కుమారుడు బండి భగీరథ్ చుట్టూ అల్లుకున్న వివాదంతో సొంత పార్టీ ఎంపీలే దూరంగా ఉంటుండటం చర్చనీయాంశంగా మారింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎనిమిది ఎంపీ స్థానాలు సాధించడం వెనుక బండి సంజయ్ కృషి ఉంది. ఎక్కడో అట్టడుగున ఉన్న పార్టీని ఉవ్వెత్తున నడిచేలా చేశారు. ఎనిమిది మంది ఎంపీలు జయకేతనం ఎగువేయడంలో

- మిగతా 2వ పేజీలో

# మోదీవి సూచనలు

- ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- నేషన్ ఫస్ట్ సిద్ధాంతంతో బీజేపీ పనిచేస్తున్నది: రాంచందర్‌రావు

హైదరాబాద్, మే 12 (ప్రజాతీర్పు):

ప్రధాని మోదీ చేసిన సూచనలు బలవంతపు ఆంక్షలు కావని, దేశ ప్రయోజనం కోసం ప్రజలు స్వచ్ఛందంగా పాటించాల్సిన సూచనలు మాత్రమే అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రధాని వ్యాఖ్యలపై తప్పుడు ప్రచా రం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో

- మిగతా 2వ పేజీలో





# కలెక్టర్లపై చర్యలకు వెనుకాడం

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు: సీఎం రేవంత్ హెచ్చరిక

- క్షేత్రస్థాయిలో ధాన్యం, మక్కల కొనుగోళ్ల తీరును పరిశీలించాలి
- ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి
- లారీలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు
- ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, మే 12 (ప్రజాతీర్పు):

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో పనిచేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లాకలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతిఅధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని చెప్పారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని స్పష్టం

- మిగతా 2వ పేజీలో

# అజ్ఞాతం వీడిన మావోయిస్టు అగ్రనేత నరహరి!

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు ప్రాంతానికి చెందిన పూనం ప్రస్తుతం రీజినల్ కమిటీ మెంబర్ హోదాలో ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో క్రియాశీలకంగా ఉన్న ఏకైక పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్‌బెస్రాతోపాటు మరికొంతమంది కేడర్‌తో కలిసి ఝార్ఖండ్‌లో ఉన్నట్లు భావిస్తున్నారు. వారికోసం ఆ రాష్ట్ర పోలీసులతో కలిసి కేంద్రబలగాలు కొద్దిరోజులుగా కూంబింగ్ విస్తృతం చేశాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే పది మంది వరకు మావోయిస్టులు అక్కడి నుంచి బయటికి వచ్చి ఆ రాష్ట్ర పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. నరహరి దంపతులు తెలంగాణ వచ్చి ఇక్కడి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

# ఒంటరైన బండి..!

(మొదటి పేజీ తరువాయి)

బండి సంజయ్ పాత్ర ఉంది. అయితే, ఇప్పుడు బండి సంజయ్ సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో ధైర్యం చెప్పాల్సిన ఎంపీలు దూరమైనట్లు తెలుస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు ఈ సంక్షోభం ఆయన కుటుంబ పరమైందని, దానికి పార్టీకి సంబంధం లేదని ప్రకటించినా..సొంత పార్టీలోనే బండి సంజయ్‌కు ధైర్యం చెప్పేవారు లేకుండా పోయారన్న భావన వ్యక్తమవుతోంది. నిన్నటి వరకు ఆయన వెంట నడిచిన వారు సైతం ఇప్పుడు దూరం పెడుతున్నట్లు తెలుస్తోంది.

### రాజకీయ ఎదురుదాడి

ఈ కేసును బండి సంజయ్ పూర్తిగా రాజకీయ కుట్ర గా అభివర్ణిస్తున్నారు. తాను ఒక బీసీ నేతగా ఎదగడాన్ని సహించలేక, తనను నేరుగా ఢీకొనే ధైర్యం లేకనే తన కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. ఇప్పటికే భగీరథ్ తరపున కరీంనగర్‌లో హనీట్రాప్, బ్లాక్‌మెయిల్ ఆరోపణలతో కౌంటర్ కేసు కూడా ఫైల్ అయింది. అయితే, చట్టం ముందు ఆరోపణలు నిరూపితమయ్యే వరకు ఈ నీలినీడలు ఆయనను వెంటాడుతూనే ఉంటాయి. రాజకీయాల్లో కొన్ని సంఘటనలు తాత్కాలికంగా అనిపించినా, కీలక సమయాల్లో అవి మళ్లీ మళ్లీ తెరపైకి వస్తుంటాయి. ముఖ్యంగా బండి సంజయ్ వంటి నాయకుడు ముఖ్యమంత్రి అభ్యర్థిగానో లేదా అంతకంటే పెద్ద పదవులకో రేసులో ఉన్నప్పుడు, ప్రత్యర్థులు ఈ కేసును ఉదాహరణగా చూపిస్తూ కుటుంబాన్ని క్రమశిక్షణలో పెట్టుకోలేని వారు రాష్ట్రాన్ని ఏం పాలిస్తారు అనే విమర్శలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. ఒక సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ విచారణలో ఎలాంటి నిజాలు బయటకు వస్తాయో వేచి చూడాలి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేయడం, బీఆర్ఎస్ నేతలు బండి సంజయ్ రాజీనామాకు డిమాండ్ చేయడం చూస్తుంటే.. ఈ సెగ త్వరగా చల్లారేలా కనిపించడం లేదు. కుమారుడిని సమర్థించుకోవడం తండ్రిగా ఆయన బాధ్యత కావచ్చు, కానీ ప్రజా ప్రతినిధిగా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఆయన.. చట్టం పట్ల తన నిబద్ధతను ఎలా నిరూపించుకుంటారన్నదే ముఖ్యం.

# హిమంత అనే నేను!

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణ స్వీకారం చేశారు. శర్మ కేబినెట్‌లో 18 నుంచి 19 మందికి చోటు కల్పించాలని నిర్ణయించారు. దీంతో ఎన్డీయే వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, రెండోసారి సీఎంగా హిమంత ప్రమాణ స్వీకారం చేసినట్లయ్యింది. సీఎం ప్రమాణ స్వీకారం చేసిన ఖానాపారా వెటర్నీ కళాశాల మైదానంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి తచ్చాడడంతో పోలీసులు అతన్ని తనిఖీ చేశారు. అతని వద్ద తూటాలు లభించగా అరెస్టు చేసి బసిస్ట పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు.

### పాలకుడిని కాదు.. సేవకుడిని: సీఎం హిమంత..

ప్రమాణ స్వీకారం అనంతరం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రజలనుద్దేశించి భావోద్వేగంగా ప్రసంగించారు. తనను రెండోసారి 'ముఖ్య సేవకుడు'గా ఎన్నుకున్నందుకు అసోం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. గత పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని కొనియాడారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి, సేవ, సమర్పణ భావంతో మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే మా కామాఖ్య దేవి, మహాపురుష్ శ్రీమంత శంకరదేవ్ ఆశీస్సులతో అసోంను మరింత ఉన్నత స్థానంలో నిలబెడతామని హిమంత పేర్కొన్నారు. తాను పాలకుడిని కాదని, సేవకుడినని సీఎం హిమంత అన్నారు.

### అసోం చరిత్రలో గొప్ప రోజు: ప్రధాని మోదీ..

ప్రమాణ స్వీకారం తర్వాత ప్రధాని మోదీ తొలుత నూతన సీఎం హిమంత బిశ్వ శర్మకు, కొత్త మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అసోం చరిత్రలో ఇది గొప్ప రోజు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరడం సంతోషకరమన్నారు. హిమంత బిశ్వ శర్మను ఒక గొప్ప అడ్మినిస్ట్రేటర్‌గా అభివర్ణిస్తూ, ఆయన నాయకత్వంలో అసోం అభివృద్ధి పథంలో మరింత వేగంగా దూసుకుపోతుందని ఆకాంక్షించారు. అలాగే కొత్తగా బాధ్యతలు చేపట్టిన నలుగురు మంత్రులు రాష్ట్ర పురోభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం భేటీకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 'క్షేత్ర స్థాయిలో బీఆర్ఎస్ పార్టీకి మంచి ఆదరణ లభిస్తోంది. పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల పనితీరును నిశితంగా గమనిస్తున్నాం. పనిచేయని వారిని పక్కన పెడతాం. ప్రజా సమస్యలపై స్పందిస్తూ కష్టపడి పనిచేసే వారికే భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయి. సీఎం రేవంత్ గుజరాత్ మోడల్‌ను పదే పదే వల్లె వేస్తున్నాడు. తెలంగాణలో బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో గుజరాత్ మోడల్‌ను మించి ఫలితాలు సాధించాం. జాతీయ స్థాయిలో అనేక సూచీల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ప్రభుత్వానికి నిధుల సమీకరణ, వనరుల వినియోగం వంటి అంశాలపై ఏ మాత్రం అవగాహన లేదు. పాలన చేతకాక కాంగ్రెస్ క్రమంగా కనుమరుగవుతోంది..' అని కేసీఆర్ చెప్పారు.

### ప్రతి నియోజకవర్గానికి సమన్వయకర్త

రాజకీయ విమర్శల జోలికి వెళ్లకుండా పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం, కార్యకర్తలకు శిక్షణ వంటి అంశాలపైనే కేసీఆర్ ఎక్కువగా మాట్లాడినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఆయా అంశాలపై నేతల అభిప్రాయాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ పద్ధతిలోనే పార్టీ సభ్యత్వ నమోదు చేయాలని ఆదేశించారు. 'ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన 'సర్' ప్రక్రియతో పాటు, ఓటర్ లిస్టు సవరణ తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్ ప్రక్రియలో జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సభ్యత్వం కూడా డిజిటల్ పద్ధతిలోనే జరపాలి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి, రాష్ట్ర కమిటీ నుండి సభ్యత్వ నమోదు సమన్వయకర్తను నియమించాలి. అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు 'సభ్యత్వ సమన్వయ కమిటీ'లను రెండుమూడు రోజుల్లో నియమించాలి. డిజిటల్ పద్ధతిలో సభ్యత్వ నమోదు చేస్తున్నందున రాష్ట్రంలో ఉన్న 35,655 పోలింగ్ బూత్‌లకు బూత్‌కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించాలి. పార్టీ ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరాలు కొనసాగుతాయి..' అని కేసీఆర్ తెలిపారు. సభ్యత నమోదు కోసం ఇన్‌చార్జిలను ప్రకటించారు. సమావేశంలో సీనియర్ నేతలు పలువురు కూడా పాల్గొన్నారు.

# 'నీట్' పరీక్ష రద్దు



- పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ నిర్ణయం
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడి.. త్వరలో పరీక్ష తేదీ ప్రకటన.. మళ్లీ అడ్మిట్ కార్డులు
- రుసుము చెల్లించకుండా మరోసారి పరీక్షకు..
- లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశం
- మాస్టర్‌మైండ్ సహా 20 మందిని అదుపులో తీసుకున్న రాజస్తాన్ ఎస్ఓజీ
- గెస్ పేపర్‌లోని ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంలో..
- పరీక్షకు 15 రోజుల ముందే అభ్యర్థులకు గెస్ పేపర్

న్యూఢిల్లీ: వైద్య విద్య అభ్యసించి, డాక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఆశయంతో జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)కు హాజరైన లక్షలాది మంది అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పిడుగులాంటి వార్త వినిపించింది. దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 3వ తేదీన జరిగిన నీట్(యూజీ)--2026 పరీక్షను రద్దు చేసినట్లు మంగళవారం ప్రకటించింది. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయినట్లు అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో జాతీయ పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను కాపాడటం, విశ్వాసాన్ని నిలబెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేసింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐని కేంద్రం ఆదేశించిందని, దర్యాప్తు సంస్థకు తమ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని, అవసరమైన రికార్డులు సమకూరుస్తామని ఎన్‌టీఏ స్పష్టంచేసింది. పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత.. అంటే మే 7న సాయంత్రం అవకతవకలకు సంబంధించిన సమాచారం ఎన్‌టీఏకు అందింది. స్వతంత్ర ధ్రువీకరణతోపాటు అవసరమైన చర్యల కోసం మే 8వ తేదీ ఉదయం కేంద్ర దర్యాప్తు సంస్థలకు నివేదించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

### పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకే..

పరీక్షకు ముందే 410 ప్రశ్నలతో కూడిన 'గెస్ పేపర్'కొందరు అభ్యర్థుల మధ్య సర్క్యులేట్ అయ్యిందని, అందులో 120 కెమిస్ట్రీ, 100కు పైగా బయాలజీ ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంతో యథాతథంగా సరిపోలాయన్న ప్రచారంతో 'నీట్'ను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడమే ఉత్తమమన్న నిర్ణయానికి వచ్చినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ నెల 3న భారత్‌తోపాటు విదేశాల్లో జరిగిన నీట్(యూజీ)--2026 పరీక్షను 22.79 లక్షల మంది రాశారు. పేపర్ లీకేజీతో వారంతా నిరాశకు గురయ్యారు. పరీక్ష మళ్లీ నిర్వహిస్తామని, అభ్యర్థులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎన్‌టీఏ ప్రకటించింది. పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలియజేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించడం వల్ల అభ్యర్థులకు, తల్లిదండ్రులకు అసౌకర్యం కలిగే మాట నిజమేనని ఎన్‌టీఏ అంగీకరించింది. కానీ, పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకు నీట్ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

### 'గెస్ పేపర్'కోసం రూ.30 లక్షలు

'గెస్ పేపర్'కోసం ఒక్కో విద్యార్థి దాదాపు రూ.30 లక్షల చొప్పున వెచ్చించినట్లు తమ విచారణలో తేలిందని రాజస్తాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్(ఎస్ఓజీ) ఏడీజీ విశాల్ బన్సాల్ మీడియాకు తెలిపారు. ఈ గెస్ పేపర్ పరీక్షకు 15 రోజుల ముందే అభ్యర్థులకు చేరిందన్నారు. డెహ్రాడూన్ నుంచి కేరళ మీదుగా సికార్‌కు చేరిన ఈ పేపర్‌ను ఒక్కో విద్యార్థి రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేసినట్లు విచారణలో బయటపడిందన్నారు. పరీక్ష ముందు రాత్రి అంటే.. మే 2వ తేదీ రూ.30 వేలకు కూడా కాపీలు అమ్మినట్లు ఆధారాలు లభించాయని ఎన్‌టీఏకు, కేంద్ర పభుత్వానికి నివేదించారు. ఎస్ఓజీ దర్యాప్తులో భాగంగా లభించిన ఆధారాలతో ఇప్పటివరకు మాస్టర్‌మైండ్ సహా 20 మందికి పైగా అదుపులోకి అనుమానితులను తీసుకున్నట్లు సమాచారం. నీట్ పేపర్ లీకేజీకి జైపూర్‌కు చెందిన మనీష్ అనే వ్యక్తిని మాస్టర్ మైండ్‌గా గుర్తించారు. రాజస్తాన్‌లో సికార్ పట్టణానికి చెందిన ఒక కోచింగ్ కెరీర్ కౌన్సెలర్‌ను అరెస్టు చేశారు.

### ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ

నీట్ పేపర్ లీక్ అంశం దేశవ్యాప్తంగా దుమారం సృష్టించింది. పలు ప్రాంతాల్లో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్‌టీఏ స్పందించి పరీక్షను రద్దు చేసింది. లీకేజీ వ్యవహారంలో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. సీబీఐ రంగంలోకి దిగింది. ఇప్పటికే రాజస్తాన్ పోలీసుల దర్యాప్తులో లభించిన వాట్సాప్ చాటింగ్‌లు, స్క్రీన్‌షాట్లు, బ్యాంక్ లావాదేవీల వివరాలు, యూపీఐ చెల్లింపులు, క్రిప్టో చెల్లింపులను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పరీక్ష జరిగిన అన్ని సెంటర్ల సీసీటీవీ ఫుటేజీ, బయోమెట్రిక్ డేటాను సేకరించారు. ఆ డేటాను, ఆధారాలను రాజస్తాన్ పోలీసులు సీబీఐకి అప్పగించారు. నీట్(యూజీ) పేపర్ లీక్ అంశంపై సీబీఐ మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

### ముఖం చాటేసిన విద్యాశాఖ మంత్రి

నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మౌనం వహించారు. ఢిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను మీడియా ప్రతినిధులు ప్రశ్నించేందుకు ప్రయత్నించగా, తప్పించుకుని కారెక్కి వెళ్లిపోయారు.

### మహారాష్ట్రలో వ్యక్తి అరెస్టు

నీట్ పేపర్ లీక్ అంశానికి సంబంధించి మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజస్తాన్ పోలీసులు అందించిన సమాచారం మేరకు అతడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అతడిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించడానికి రాజస్తాన్ పోలీసుల బృందం రానున్నట్లు పేర్కొన్నారు.

### సందేహాలు-సమాధానాలు

నీట్ రద్దు కావడంతో అభ్యర్థులు, తల్లిదండ్రుల్లో రకరకాల సందేహాలు తలెత్తుతున్నాయి. వీటిపై నీట్ వర్గాలు కొంత స్పష్టత ఇచ్చాయి.

**మళ్లీ పరీక్ష ఎప్పుడు?**

నీట్ తేదీని ఇంకా ప్రకటించలేదు. ఎప్పుడు నిర్వహించాలన్నది ఇంకా నిర్ణయించలేదు.

**మళ్లీ రిజిస్టర్ చేసుకోవాలా?**

అవసరం లేదు. ఇప్పటికే చేసుకున్న రిజి?రస్ట్రేషన్ డేటా, అభ్యరి?థత్వాన్ని త్వరలో మళ్లీ నిర్వహించే పరీక్షకు బదిలీ చేస్తారు.

**ఫీజు చెల్లింపు మాటేమిటి?**

ఈ ఏడాది నీట్ రాసిన అభ్యర్థులు మళ్లీ పరీక్ష రాయడానికి అదనంగా ఫీజులు చెల్లించాల్సిన పనిలేదు. గతంలో చెల్లించిన రుసుమును అభ్యర్థులకు తిరిగి(రీఫండ్) చెల్లిస్తారు.

**అడ్మిట్ కార్డులు కొత్తగా ఇస్తారా?**

అవును. కొత్త అడ్మిట్ కార్డుల జారీపై త్వరలో అధికారికంగా ప్రకటన చేస్తారు.

**పరీక్షా కేంద్రాలను మారుస్తారా?**

మే 3న జరిగిన పరీక్షకు ఎంచుకున్న కేంద్రాలనే తిరిగి నిర్వహించే పరీక్షకు కూడా కొనసాగిస్తారు.

### పది రోజుల్లోగా షెడ్యూల్: అభిషేక్

నీట్ పునఃపరీక్ష షెడ్యూల్‌ను రాబోయే 7 నుంచి 10 రోజుల్లోగా ప్రకటిస్తామని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మంగళవారం తెలిపారు. అతి త్వరలో తన బృందంతో చర్చిస్తానని, పూర్తి పరీక్షల షెడ్యూల్, తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల విద్యా క్యాలెండర్, ప్రవేశాల షెడ్యూల్‌కు అంతరాయం కలగకుండా వీలైనంత తక్కువ సమయంలోనే పరీక్ష నిర్వహించడానికి కృషి చేస్తామని చెప్పారు. మరో వారం, పది రోజుల్లోగానే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. లీకేజీ ఘటన నిజంగా బాధాకరమని, ఇలాంటివి తక్షణమే ఆగిపోవాలని అభిషేక్ సింగ్ తేల్చిచెప్పారు. పేపర్ లీకేజీలు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అలాగే మొత్తం వ్యవస్థకు ఆందోళన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు. జరిగిన దానికి తాము బాధ్యత తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి అవకతవకలు జరగకుండా పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టంచేశారు. నీట్‌కు ముందు విద్యార్థుల మధ్య పీడీఎఫ్ ఫార్మాట్‌లో సర్క్యులేట్ అయిన కొన్ని ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంతో సరిపోలడంతో పరీక్షను రద్దు చేయాలని తాము సిఫార్సు చేశామని వివరించారు. మొత్తం పేపర్ లీక్ కాలేదని చెప్పారు.

# కలెక్టర్లపై చర్యలకు వెనుకాడం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై రేవంత్ ఆరా తీశారు.

### ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలి

'గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలి. రవాణా శాఖ కమిషనర్ ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలి. ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు. అవసరమైతే స్థానికంగా ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలి. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకూడదు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు సీఎస్‌కు నివేదికలు పంపాలి.

### రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను వాడుకోండి

సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు మిల్లుల్లో స్థలం సరిపోవడం లేదని అంటున్నారు. చాలా ప్రాంతాల్లో గోదాముల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను తీసుకుని ధాన్యాన్ని అక్కడికి తరలించాలి. తర్వాత పరిస్థితిని బట్టి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి..'అని సీఎం ఆదేశించారు.

### అకాల వర్షాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ

'అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా కలెక్టర్లు ప్రణాళికలు సిద్ధం చేయాలి. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలి. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.

### ప్రతి మిల్లు వద్ద ఒక అధికారి ఉండాల

ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలి. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలి. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు ఇవ్వాలి. అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు..'అని ముఖ్యమంత్రి అన్నారు.

### సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురండి: మంత్రి ఉత్తమ్

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధాన్యం సేకరణ విషయంలో ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

### పొరుగు రాష్ట్రాల ధాన్యంతో సమస్యలు: మంత్రి తుమ్మల

సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంతమంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. అలా ధాన్యం రాకుండా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణారావు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మోదీవి సూచనలు

(మొదటి పేజీ తరువాయి)



మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అవసరం లేని బంగారం కొనుగోళ్లు తగ్గించాలి, విదేశీ పర్యటనల కంటే దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహిం చాలి, స్వదేశీ వస్తువులను కొనాలి, ఇంధన పొదుపు పాటించాలి అనే ఉద్దేశంతో ప్రధాని ఈ సూచనలు చేశారని చెప్పారు. బీజేపీ ఎప్పుడూ నేషన్ ఫస్ట్ సిద్ధాంతంతోనే పని చేస్తుందని, కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం పవర్ ఫస్ట్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. దేశ ప్రయోజనం ముందు రాజకీయాలు ఉండకూడదన్నారు. కాం గ్రెస్ పార్టీ కావాలనే వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని మండిపడ్డారు. సీఎం రేవం త్‌రెడ్డి, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి నాయకులు ప్రధాని మోదీ చేసిన సూచనలపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. లండ న్, అమెరికా, యూరప్ దేశాల్లో హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, మంత్రులు, ప్రధానులు ప్రజా రవాణానే ఉపయోగిస్తారని, లండన్‌లో ట్యూబ్స్ పేరుతో అండర్ గ్రౌండింగ్ మెట్రో వ్యవస్థను విస్తృతంగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. అది ఆర్థిక క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసమన్నారు. వ్యక్తిగత ఆర్థిక క్రమశిక్షణ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ప్రధాని మోదీ సూచనలను విమర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ తమ గత చరిత్రను తెలుసుకోవాలన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రజలకు బియ్యం వినియోగం తగ్గించాలని చెప్పారని, ఉత్తర భారతదేశ ప్రజలను రొట్టెల వినియోగం తగ్గించాలని కోరార న్నారు. రెండోసారి ప్రధానమంత్రి అయిన తర్వా త వారానికి ఒకసారి ఉపవాసం ఉండాలని కూడా ప్రజలకు సూచించారన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి ప్రతి సోమవారం భోజనం మానే యాలని దేశ ప్రజలను సూచనలు చేశారని, ఇంది రా గాంధీ హయాంలో టాక్ లెస్ - మోర్ నినాదం తీసుకొచ్చారని, ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేశారన్నారు. 1976లో బలవంతపు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టారని, సంజయ్ గాంధీ ఆధ్వర్యంలో బలవంతపు స్టెరిలైజేషన్ కార్యక్రమాలు అమలు చేశారని, ప్రజలపై ఒత్తిడి తెచ్చి వాసెక్టమీ ఆపరేషన్లు చేయించారన్నారు. మన్మోహన్ సింగ్ సబ్సిడీలను తగ్గించాల్సిందే అన్నారు. ఆర్థిక సంక్షోభ సమయంలోకాంగ్రెస్ నాయకులే ప్రజలకు చెప్పార న్నారు. 2013లో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం కూడా బంగారం కొనుగోలు నిలిపివేయాలంటూ ప్రజలను కోరారని, అప్పుడు కాం గ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడలేదు? అని ప్రశ్నించారు పపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని, పశ్చిమాసియా పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్ల పై ప్రభావం పడుతోందని, అనేక దేశాల్లో పెట్రో ల్ ధరలు భారీగా పెరిగాయన్నారు. భారత్‌లో పెట్రోల్ ధరలను కేంద్ర ప్రభుత్వం స్థిరంగా ఉం చిందన్నారు. యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాల మధ్య తేడా గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. యూపీఏ కాలంలో రూ.2 లక్షల వరకు మాత్రమే పన్ను మినహాయింపు ఉండగా, ఇప్పుడు రూ. 12.75 లక్షల వరకు పన్ను రాయితీ కల్పించామన్నారు. యూపీఏ కాలంలో బ్యాంకుల ఎన్పీఏలు 11 శాతం ఉండగా, ఇప్పుడు 0.6 శాతానికి తగ్గాయన్నారు. యూపీఏ కాలంలో మౌలిక వసతు లపై రూ.1.57 లక్షల కోట్లు ఖర్చుచేస్తే, ఎన్డీఏ రూ.44.3 లక్షల కోట్లకు పెంచారన్నారు. యూపీ ఏ కాలంలో రూ.13 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగితే, ఎన్డీఏ కాలంలో రూ.320 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగిందన్నారు. 2014లో దేశ విదేశీ మారక నిల్వలు సుమారు 304 బిలియన్ డాలర్లు ఉండగా, ఇప్పుడు 655 బిలియన్ డాలర్లకు పెరిగాయన్నారు. 2014లో ప్రపంచ జీడీపీ ర్యాంకింగ్‌లో భారత్ 10వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం 5వ స్థానానికి చేరుకున్నదన్నారు.



## భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో డ్రగ్స్ మరియు యోగసనలపై అవగాహన సదస్సు

**(కపిల్ వాగ్మారే సి ఆర్ కె ప్రజా తీర్పు భైంసా) మే 12**

99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల బైంసాలో ఈరోజు విద్యార్థుల కోసం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు మరియు యోగా ప్రాముఖ్యతపై ప్రత్యేక కార్యక్రమం. నిర్వహించబడింది. విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం, క్రమశిక్షణ మరియు సమాజం పట్ల బాధ్యత పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన డాక్టర్ కోసారి సంతోష్ గారు డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు ఎలా నాశనమవుతుందో,వాటి దుష్ప్రభావాలు ఎంత తీవ్రమై ఉంటాయో వివరించారు. అలాగే డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకుపిలుపునిచ్చారు అదేవిధంగా కళాశాల యోగా గురువు డాక్టర్ కె. రఘునాథ్ గారు రసాయన శాస్త్ర సహాయ ఆచార్యులు యోగాసనాల ప్రాముఖ్యత, శారీరక-మానసిక ఆరోగ్యంపై యోగా చూపే ప్రభావం, జీవనశైలి వ్యాధులను యోగా ద్వారా ఎలా నియంత్రించవచ్చో విద్యార్థులకు ప్రదర్శనలతో సహా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య, మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రమశిక్షణ మరియు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. యోగా మన జీవితంలో భాగమైతే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ భీమరావు, యు. రవికుమార్,డాక్టర్ శంకర్, ఏ. రాజు, డాక్టర్ ఓం ప్రకాష్, డాక్టర్ నివేద,డాక్టర్ కల్పన, శ్రావణి, దివ్య, రామ్మోహన్, రాజయ్య, ఏ. శ్రీనివాస్ అబ్దుల్లా,మజార్, వసి, ఇమ్రాన్, ఉజ్మా తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు విద్యార్థుల్లో మానసిక ధైర్యం,ఆరోగ్యకర జీవన విధానం మరియు సామాజిక బాధ్యత పెంపొందించేందుకు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది.



## కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా గోదాములలో నిల్వ

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) మే 12**

అకాల వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములను నిల్వ చేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల మార్కెట్ యార్డు గోదామును జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, ఉపతహసిల్దార్ సనత్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములలో నిల్వ చేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన లారీల నుండి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండలం ఆస్నాద్, ఒత్కులపల్లె గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కోటపల్లి మండలం దేవులవాడ, లక్ష్మీపూర్ గ్రామాలలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర లతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఈసారి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చినట్లయితే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పేదల ఆరోగ్యానికి ఎంత ఖర్చయినా భరిస్తాం: కేఎల్ఆర్

### సీఎంఆర్ఎఫ్. చెక్కులతో రోగుల కుటుంబాలకు ఆర్థిక స్వాంతన

**(వైయాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.12**

పేదల ఆరోగ్యానికి భద్రతగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇవాళ తుక్కుగూడ కార్యాలయంలో 50 మందికి. సీఎంఆర్ఎఫ్. చెక్కులను రోగులు, వారి బంధువులకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య చికిత్స తీసుకున్నా... సీఎంఆర్ఎఫ్. తో కొంత ఆర్థిక చేయూత అందిస్తున్నామని. కేఎల్ఆర్. తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థిక భారమైన పేదల వైద్యానికి ఎంత ఖర్చయినా... భరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారు సిద్ధంగా ఉన్నారని కిచ్చెన్నగారు గుర్తు చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందించటం సంతోషమని కాంగ్రెస్ నేతలు, రోగుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక డెస్క్ పెట్టి. సీఎంఆర్ఎఫ్. చెక్కులు అందించేందుకు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి గారు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు, రోగులు, వారి బంధువులు పాల్గొన్నారు.

# స్టేట్ కార్పొరేషన్ పోస్టులకు ముస్లింలను నియామకం చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 12**



ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం జగిత్యాల అని, ముస్లింలు ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారని మున్సిపల్ ఎన్నికలైనా, అసెంబ్లీ ఎన్నికలైనా, ఎంపీ ఎన్నికలైనా అదే వైఖరి కొనసాగుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయ్యాయి. కానీ ఇప్పటివరకు జగిత్యాల ముస్లిం వర్గం నుండి ఎవరికీ రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్ట్ రాలేదని వివరించారు. జగిత్యాల టీపీసీ సీనియర్ లీడర్, మిల్లత్-ఎ-ఇస్లామియా, మాజీ అధ్యక్షుడు మీర్ కాజిం అలీ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని వీరితో పాటు మరొక కాంగ్రెస్ పార్టీ నాయకుడికి డైరెక్టర్ పోస్ట్ ఇవ్వాలి. జగిత్యాల కు చెందిన సీనియర్ నాయకుడు మీర్ కాజిం అలీ నామినేటెడ్ పోస్ట్ ఇప్పించడానికి తప్పకుండా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రతినిధి బృందంలో జనాబ్ షరపుద్దీన్ , అమీర్ తబ్లీగీ జమాత్ , జిల్లా హాఫిజ్ సయ్యద్ షంసుద్దీన్ తబ్రేజ్ గారు, అధ్యక్షుడు జమియత్ ఉలమా అబ్దుల్ జలీల్ గారు, అధ్యక్షుడు అహ్లే హదీస్, ఎం.ఏ. సలీం అబిద్ గారు, జనరల్ సెక్రటరీ అహ్లే సున్నతుల్ జమాత్, ఖాజా లియాఖత్ అలీ మొహ్సిన్ గారు, జిల్లా అధ్యక్షుడు ఖాజీ మక్సూద్ అలీ మతీన్ గారు, అధ్యక్షుడు ఖాజీ, సుమేర్ ఉద్దీన్ ఆజాద్ , అధ్యక్షుడు జగిత్యాల టౌన్, డా. ఎం.డి. అయూబ్ ఖాన్ గారు, కౌన్సిలర్ 34వ వార్డు, ఉపాధ్యక్షుడు ముస్లిం కమిటీ, ముజాహిద్ ఆదిల్ గారు, అధ్యక్షుడు మసీద్-ఎ-పురానిపేట్ షేక్ నజీర్ అహ్మద్ గారు, అధ్యక్షుడు మసీద్-ఎ-జం జం, ఇర్ఫాన్ జాఫర్ రషీద్ గారు, సీనియర్ రిపోర్టర్ ఖాజా అమీర్ ఉద్దీన్ గారు, జనరల్ సెక్రటరీ అబ్దుల్ రెహ్మాన్ గారు, జిల్లా ఈ సి సభ్యుడు ఆరిఫ్ హుస్సేన్ గారు, జనరల్ సెక్రటరీ ఈద్గా కమిటీ, ఎం.డి. రియాజ్ ఉద్దీన్ గారు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ యూత్ మరియు కాంగ్రెస్ , బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 12(ప్రజాతీర్పు ):**

వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం, పట్టణంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పిల్లలతో ముచ్చటించి వారి వివరాలు, జీవిత లక్ష్యాలు ఏంటో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సమ్మర్ క్యాంప్ కి రావాలని చెప్పారు. సమ్మర్ క్యాంపులో ఆటలు, పాటలు, యోగ, డ్యాన్స్, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వేసవి శిబిరాలతో పిల్లల నైపుణ్యాల పెరుగుదలతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందన్నారు. ఉపాధ్యాయులు, శిక్షకులు, వేసవి శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని విషయాలు చక్కగా నేర్పించాలని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, అందరూ ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని, అధైర్య పడవద్దని ప్రోత్సహించారు. ఆయా సబ్జెక్టులు శ్రద్ధగా చదువుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. వారి భయాలు, సందేహాలు తొలగించి, వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పి డిప్యూటీ సీఈవోగా ఆకుల సంజీవరావు

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 12:**



పెద్దపల్లి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా ఓదెల మండలానికి చెందిన ఆకుల సంజీవరావు నియమితులయ్యారు. కరీంనగర్ రూరల్ మండలానికి ఎంపీడీవో గా సేవలందించిన సంజీవరావు పదోన్నతి పై పెద్దపల్లి జిల్లా జెడ్పి డిప్యూటీ సీఈవోగా నియమితులయ్యారు. మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ఓదెల మండలానికి చెందిన ఆకుల సంజీవరావు పెద్దపల్లి జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవోగా నియమితులైనందుకు ఓదెల మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి...

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 12.**

జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో, జడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల ప్రత్యేక శిక్షణా తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ఎం. సంజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు పదవ తరగతిలో ఫెయిల్ అయినంత మాత్రాన నిరాశ నిస్పృహలకు లోను కావొద్దని, నేను కూడా పదవతరగతి పరీక్షలో రెండు సబ్జెక్టులు తప్పానని, ఉపాధ్యాయుల ప్రోద్బలంతో, ఆత్మవిశ్వాసంతో మళ్లీ పాస్ అయి, ఈ రోజు జనాలు అందరూ మెచ్చే వైద్యుడిగా, శాసనసభ్యుడిగా మీ ముందున్నానని తెలుపుతూ, పిల్లలందరూ ఈ శిక్షణా కార్యక్రమంలో ఆయా సబ్జెక్టులో ఉన్న మెళకువలు నేర్చుకొని, ఆత్మవిశ్వాసంతో పదవ తరగతి పరీక్షలు రాసి పాస్ అయి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి రాము గారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇట్టి శిక్షణా కార్యక్రమం పదవతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పిల్లలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ మండల విద్యాధికారి చంద్రకళ, జగిత్యాల గ్రామీణ మండల విద్యాధికారి గంగాధర్, ధరూర్ క్యాంప్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా తీగల పుష్పలత

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పుఇల్లంతకుంట ) మే12**




ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా తీగల పుష్పలత గౌడ్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా పుష్పలత గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణకు, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ , ప్రభుత్వ ఆది శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పార్టీ మండల నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పార్టీ కోసం కృషి చేస్తానని, అదేవిధంగా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు

# ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యహావరించిన జిల్లా కలెక్టర్

- ఎంఐఎం కు తొత్తుగా వ్యవహరిస్తున్న అధికారులు
- కౌన్సిలర్ల దీక్షకు సంఘీభావం ప్రకటించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 12**



మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి తో పాటు బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు సోమవారం అర్ధరాత్రి నుండి ఆందోళన చేపట్టి నిరాహార దీక్షకు పూనుకున్న సందర్భంగా వారికి సంఘీభావం ప్రకటించి ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి కో ఆప్షన్ ఎన్నిక జరుపుతామని సోమవారం కలెక్టర్ చెప్పగా ఆయన అనుమతితోనే 12వ తేదీన ఎన్నిక జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తెలియజేసినప్పటికీ,రాత్రివేళ కో ఆప్షన్ ఎన్నిక రద్దు అయినట్లు వాట్సాప్ మెసేజ్ పంపడం సరి కాదన్నారు . ఎన్నిక ఎందుకు వాయిదా వేశారో తెలియజేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పై ఉందన్నారు. ఎన్నికవాయిదా వేశారంటే అధికారులు ఎంఐఎంకు, ప్రభుత్వానికి వత్తాసు పలకడమేనన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ , అధికారులపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లనున్నట్లు చెప్పారు. అవసరమైతే ప్రజాస్వామానికి విరుద్ధంగా,వ్యవహరించిన తీరుపై అసెంబ్లీలో మాట్లాడతానన్నారు. ఎన్నిక నిర్వహించే వరకు కౌన్సిలర్లు చైర్మన్ అక్కడే బైఠాయిస్తారని వారికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు బైంసా మున్సిపాలిటీని పాలించిన ఎంఐఎం పార్టీకి,ఇంకా అధికార దాహం వీడలేదన్నారు. ప్రజలు తమకు అధికారమిస్తే ,ఎంఐఎం పార్టీ ఓర్వలేకనే కుట్రలకు,పాల్పడుతుందన్నారు. మున్సిపల్ పాలకవర్గం నియమకమై,కేవలం రెండు నెలలు మాత్రమే అయిందని, ఎంఐఎం నాయకుల వ్యవహారం సరికాదన్నారు. పాలకవర్గం పిలుపుమేరకు బంద్ కుసంపూర్ణ మద్దతు ప్రకటించిన ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. దీక్షలో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి,వైస్ చైర్మన్ తో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు. వీరు చేపడుతున్న దీక్షకు పెద్ద మొత్తంలో ప్రజలు సంఘీభావం ప్రకటించారు.

# జైపూర్ పవర్ ప్లాంట్ లో వైద్య ఆరోగ్య కార్యక్రమం

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 12**



మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత మంగళవారం జైపూర్ పవర్ ప్లాంట్ లో వైద్య ఆరోగ్య కార్యక్రమంలో పైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జైపూర్ పవర్ ప్లాంట్ లో అసంక్రమణ వ్యాధులైన బిపి దయాబెటిస్ వ్యాధిగ్రస్తులను గుర్తించడము క్యాన్సర్ రోగులను గుర్తించడం అవగాహన మందులు అందజేయడం అదేవిధంగా కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడం వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులు మరియు మలేరియా డెంగ్యూ చికెన్ గుని అలాంటివి పరబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత దోమలు పెరగకుండా తీసుకోవలసిన చర్యలు వాటిపైన అవగాహన కలిగించడం జరిగినది అదేవిధంగా 14 సంవత్సరములు నిండిన బాలికలకు ఉచితంగా క్యాన్సర్ నివారణ కోసం గర్భాశయ క్యాన్సర్ రాకుండా ముందస్తు భాగంలో హెచ్ పి వి వ్యాక్సినేషన్ ప్రాముఖ్యత ను ఇప్పించాలని తెలియజేయడం జరిగినది అదేవిధంగా ఆయుష్ కార్యక్రమంలో భాగంగా యోగా మెడిటేషన్ పైన ఆహ్వాన కలిగించడము ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగినది ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు జిల్లాలో వైద్య సేవల ప్రాముఖ్యత ఎక్కడెక్కడ ఈ సేవలు అందిస్తున్నాము తెలియజేయడం జరిగినది ముఖ్యంగా జిల్లాలో ఎండలు విపరీతంగా, పెరుగుతున్నందున వడదెబ్బ వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత వేడి గాలుల కారణంగా వడదెబ్బ డిహైడ్రేషన్ సాధారణంగా వచ్చే వ్యాధులు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకం కావచ్చు కావున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వడదెబ్బ పైన అవగాహన కలిగించడం జరిగినది ముఖ్యంగా జిల్లాలో వడదెబ్బ కార్యక్రమంలో పైనా అవగాహన కలిగిస్తున్నట్లు తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ముస్తాఫా,డాక్టర్ సింధూర, డాక్టర్ పద్మజ,సి హెచ్ ఓ రాజిరెడ్డి, జైపూర్ పవర్ ప్లాంట్ కు సంబంధించిన అధికారులు సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది పోలీసు సిబ్బంది మరియు వారి అధికారులు జై వైకుంఠం పాల్గొన్నారు

# అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఉరివేసుకొని ఆత్మహత్య

- తండ్రి దినకర్మ తనయుడు ఉరివేసుకొని మృతి
- ఇంట్లో ఇద్దరు పెద్దదిక్కులు కోల్పోవడంతో కుటుంబం విషాదం

**సిరిసిల్ల స్టాపర్ ఎల్లారెడ్డిపేట మే 12 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో అప్పుల బాధ తట్టుకోలేక ఆటో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం పాముల భాస్కర్ గౌడ్ (36) ఆటో నడుపుకుంటూ కుటుంబానికి పోతాడు. భాస్కర్ తండ్రి బాలమల్లు అనారోగ్యంతో సమస్యలతో ఐదు రోజుల క్రితం మృతి చెందాడు సోమవారం రోజు ఆయన దినకర్మ చేశాడు.. ఇటీవల చేసిన అప్పులు ఎక్కువవడంతో తీవ్ర మనస్థాపానికి చెంది తండ్రి దినకర్మ రోజే అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఎంత వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామ శివారులో వేప చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతూ మిగతాజీవియా గ్రామస్తులు కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు మృతదేహం వద్దకు వెళ్లి బోరుణ విలపించారు... ఐదు రోజుల వ్యవధిలోని తండ్రి, కుమారుడు చనిపోవడంతో కుటుంబంలో విషాదశాలనుకున్నాయి. మృతుని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు.

## తీర్మాన ప్రతి సమర్పించడంలో ఆలస్యంపై సర్పంచ్ కు షో కాజ్ నోటీసు జారీ

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 12**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి సంబంధించిన గ్రామపంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో జాప్యంపై చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ తోకల మల్లేష్ కు షో కాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిచ్చి, మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు మండలం సోమన్‌పల్లి గ్రామ పంచాయతీలో మంజూరు చేసి పాఠశాల నిర్మాణానికి తగినంత నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన గ్రామ పంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో విపరీతమైన జాప్యం జరుగుతున్నట్లు గమనించడం జరిగిందని, ఈ విషయమై సరైన వివరణ కోరుతూ నోటీసు జారీ చేయడం జరిగిందని, సకాలంలో వివరణ అందించని పక్షంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 37(5) చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# గంగాధర క్షేత్రంలో ఘనంగా అష్టమ వార్షికోత్సవ వేడుకలు

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) మే 12**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన గంగాధర క్షేత్రంలో అష్టమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు, ఆలయ వ్యవస్థాపకుడు మూగు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహా చండీ హోమం, స్పటిక లింగానికి విశేష ద్రవ్యాలచే అభి షేకాలను నిర్వహించారు. అనంతరం గంగాధర క్షేత్రం లోని మూగు దామోదర శర్మ అన్నదాన సత్రంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పురోహితులు, వ్యవస్థాపకులు మూగు నాగరాజు శర్మ, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గార్ల సిహెచ్సిలో క(మ్యూనిటీ హెల్త్ సెంటర్) అంతర్జాతీయ నర్సుల దినోత్సవం.

**(పగడాల రామారావు ప్రజా తీర్పు ప్రతినిధి గార్ల మండల ) మే 12**



స్థానిక మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం మంగళ వారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ హనుమంత రావు, నర్సులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సేవలను నరసన్న పాత్ర కీలకమని అన్నారు అనంతరం నర్సులను శాలువాలతో ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో నర్సులు, తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ కూలీలకు కొత్త రూల్.. ఇక నుంచి రెండు పూటలు.. ఫోటోలు

**(పగడాల రామారావు, ప్రజా తీర్పు మండలం ప్రతినిధి) మే 12**



గార్ల. ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరులో జరుగుతున్న అవకతవకలకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. ఉపాధి పనులు చేసేందుకు వచ్చిన కూలీల ఫోటోలను రెండు పూటలా తప్పనిసరిగా తీయాలని ఆదేశాలు జారీ చేసింది. ఒక పూట మాత్రమే ఫోటో తీస్తే.. సదరు కూలీకి ఆ పూటకు సంబంధించిన వేతనం మాత్రమే వస్తుందని స్పష్టం చేసింది. ఈ నూతన విధానం సోమవారం నుంచే అమల్లోకి వస్తుంది. ఇది పథకం అమలులో పారదర్శకతను పెంచుతుందని కేంద్రం భావిస్తోంది. కేంద్రం అమలులోకి తెచ్చిన ఈ నూతన విధానం ప్రకారం.. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (చీవీమీ) యాప్‌లో అప్‌లోడ్ అవుతున్న ఫోటోలను పంచాయతీ కార్యదర్శుల నుండి రాష్ట్ర స్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వరకు నిత్యం ధృవీకరించాల్సి ఉంటుంది. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫోటోల ధృవీకరణ సమయంలో అధికారులు కొన్ని కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రం సూచించింది. మేట్ లేదా ఫీల్డ్ అసిస్టెంట్ సంబంధం లేని ఫోటోను అప్‌లోడ్ చేశారా? పని ప్రదేశంలో తీసిన లైవ్ ఫోటో కాకుండా పాత ఫోటోను అప్‌లోడ్ చేశారా? ఫోటోలో ఉన్న వ్యక్తుల సంఖ్యకు, మస్టర్‌లో హాజరైన వ్యక్తుల సంఖ్యకు తేడా ఉందా? ఫోటోలలో ఉన్న స్త్రీ, పురుషుల సంఖ్య, మస్టర్‌లో హాజరైన స్త్రీ, పురుషుల సంఖ్య సమానంగా ఉన్నాయా? వేర్వేరు మస్టర్లలో ఒకే వ్యక్తులను క్యాప్చర్ చేశారా? ఉదయం తీసిన ఫోటోలలో ఉన్న వ్యక్తులే, మధ్యాహ్నం తీసిన ఫోటోలలో ఉన్నారా, లేక మారారా? అనేది చూసుకోవాలి. అంతే కాకుండా.. మధ్యాహ్నపు ఫోటోను క్యాప్చర్ చేశారా, లేదా? అనేది కూడా చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం తెలంగాణలోని ప్రతి విలేజ్ సెక్రటరీ నుండి కమిషనర్ వరకు అందరికీ ఈ ధృవీకరణ బాధ్యతలు అప్పగించారు. చీవీమీ యాప్‌లో మేట్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు తీసిన ఉపాధి కూలీల అటెండెన్స్ ఫోటోలన్నింటినీ ప్రతిరోజూ పంచాయతీ కార్యదర్శులు ధృవీకరించి, నివేదికను ఎంపీడీఓకు పంపించాలి. మండల స్థాయిలో.. అన్ని గ్రామాల నుంచి ఒక రోజులో వచ్చిన మొత్తం ఫోటోల్లో కనీసం 20 శాతం ఫోటోలు, లేదా గ్రామానికి రెండు ఫోటోల చొప్పున ఎంపీడీఓ ఆఫీసులోని ఏపీఓ, కాంట్రాక్ట్ స్టాఫ్, పర్మినెంట్ స్టాఫ్ అదే రోజు ధృవీకరించి, నివేదికను కలెక్టర్, డీఆర్డీఏకు పంపించాలి. జిల్లా స్థాయిలో.. ముందు రోజు క్యాప్చర్ చేసిన ఫోటోల్లో కనీసం 30 ఫోటోలను కలెక్టర్ ధృవీకరించాలని ఆదేశాల్లో పేర్కొంది. డీఆర్డీఏ కాంట్రాక్ట్, పర్మినెంట్ స్టాఫ్ ఒక్కొక్కరు జిల్లావ్యాప్తంగా వచ్చిన మొత్తం ఫోటోల్లో రోజుకు 10 శాతం లేదా 200 ఫోటోలను ధృవీకరించాలి. అలాగే.. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రోజుకు 20 ఫోటోలను ధృవీకరించాలని సూచించింది. కమిషనరేట్‌లో పనిచేసే కాంట్రాక్ట్, పర్మినెంట్ స్టాఫ్ ఒక్కొక్కరు 100 ఫోటోలు లేదా రాష్ట్రవ్యాప్తంగా ముందు రోజు అప్‌లోడ్ అయిన వాటిలో ఐదు శాతం ఫోటోలను ధృవీకరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది చీవీమీ యాప్‌లో ప్రస్తుతం తీసిన ఫోటోలు కేవలం 15 రోజులు మాత్రమే నిల్వ అవుతున్నాయి. అయితే.. ఇకపై ఉపాధి హామీ కూలీల ఫోటోలు, మస్టర్ వివరాలను సోషల్ ఆడిట్ పూర్తయ్యే వరకు, అంటే ఒక సంవత్సరం పాటు నిల్వ చేయాలని కేంద్రం ఆదేశించింది. ఫోటోల నిల్వ కోసం ఒక్కో మండలానికి 1 టీబీ (టెరాబైట్) కెపాసిటీ గల హార్డ్ డిస్క్‌ను కొనుగోలు చేయాలని కూడా ఉత్తర్వుల్లో సూచించారు. ఈ కొత్త విధానం పారదర్శకతను పెంచుతుందని ఆశిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయి సిబ్బంది తమ ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరం నాలుగైదు గ్రామాల బాధ్యతలు చూస్తున్నామని.. ఉదయం, మధ్యాహ్నం పని ప్రదేశాలకు వెళ్లి ఫోటోలు తీసుకోవడం వ్యయ, ప్రయాసలతో కూడిన పని అని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం వల్ల సిబ్బందిపై పని భారం పెరగడంతో పాటు, రవాణా ఖర్చులు కూడా పెరుగుతాయని వారు వాపోతున్నారు. ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన పరిష్కార మార్గాలు కనుగొనాలని వారు కోరుతున్నారు.



## టీవీ అనుమానిత బాధితులకు పరీక్షలు.

### టీ,బి ముక్త్ భారత్ అభియాన్.

**(పగడాల రామారావు ప్రజా తీర్పు మండలం ప్రతినిధి గార్ల) మే 12**

గార్ల స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో.. సర్పంచ్ బి పార్వతి హథిరామ్ నాయక్‌అధ్యక్షతన మంగళవారం స్థానికమండల వైద్య సిబ్బంది చేత.. టీ,బీ అనుమానిత బాధితులకు పరీక్షలు నిర్వహించి.. అవసరం ఉన్నవారికి మందులను, అందజేశారు చెస్ట్ ఎక్స్రే లను చేయడం జరుగుతున్నది. వైద్యులు డా. శివకుమార్ మాట్లాడుతూ. టీబి అంటువ్యాధి కాదని సరైన టైంలో మందులు వాడితే నయమవుతుందని ఎవరు ఆందోళన చందవలసిన అవసరం లేదనిఅని అన్నారు కార్యక్రమంలో, డాక్టర్ నవీన్ కుమార్, సూపర్వైజర్లు ఇస్మాయిల్ బేగ్, వెంకటేశ్వరరావు, నర్సులు.. పంజాల పద్మ, పార్వతి జయ స్వప్న, ఎం.ఎల్ హెచ్ పి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవన స్థితికి యోగా తోడ్పాటు

**మంథని, మే 12(ప్రజాతీర్పు)**



మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవాల రెండో రోజు కార్యక్రమంలో యోగా సాధన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పరశయ్య మాట్లాడుతూ.. యోగా ఆరోగ్యవంతమైన జీవనానికి మంచి సాధనమని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు సాధించారు. అలాగే పీజీ, బి.ఎడ్, ఐసెట్, లాసెట్ తదితర ప్రవేశ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లేపల్లి సర్పంచ్ లక్కాకుల సత్యనారాయణ, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కొండెల మారుతి తదితరులు పాల్గొన్నారు.



## కల్వచర్లలో ఇందిరమ్మ ఇళ్ల విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**రామగిరి, మే-12(ప్రజాతీర్పు)**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ సౌకర్యాల సమస్యలను ఉమ్మడి కమన్ పూర్ మండలం మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఈడీతో మాట్లాడారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్యల పరిష్కార దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన కరెంట్ పోల్స్, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఏడి వెంకటరమణ, ఏఈ మహేందర్ రెడ్డి, లైన్‌మన్ శ్రీనివాస్ గ్రామంలో పరిశీలన అనంతరం వెల్లడించారు. త్వరితగతిన ఎస్టిమేట్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు విద్యుత్ వెలుగులు అందించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, సంబంధిత అధికారులకు గంట వెంకటరమణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



## కుబీర్ శివాజి బీడీ సెంటర్ లో కార్మికుల సంబరాలు

### యూనియన్ నాయకులకు స్వీట్స్ తినిపిస్తున్న కార్మికులు

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 12**

బీడీ కార్మికుల వేతనాల పెంపుపై మంగళవారం,కుబీర్ బీడీ కంపెనీలో హర్షం వ్యక్తం చేస్తూ కార్మికులు యూనియన్ నాయకులకు స్విట్లు పంచుకుంటూ సంబరాలు చేసారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం హరిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న లక్షల మంది బీడీలు చుట్టే కార్మికులు,బీడీ ప్యాకర్లు, బట్టీవాలా, చెన్నివాలా,బీడీ చాటర్స్,ట్రై పిల్లర్, క్లర్క్స్ మొదలగు కేటగిరీలకు చెందిన బీడీ కార్మికుల వేతన ఒప్పందం కోసంబీడీ కార్మిక సంఘాలకు బీడీ యాజమాన్య సంఘంతో జరిగిన,చర్చల్లో బీడీ ప్యాకర్లకు నెలకు 4500 రూ, నెలసరి ఉద్యోగులకు 2200 రూ మరియు బీడీలు చుట్టే కార్మికులకు వెయ్యి బీడీలకు 6.00 రూ చొప్పున కూలి రేట్ల పెంపుకు అగ్రిమెంట్ కుదిరింది. ఈ నెల నుండి అమల్లో ఉంటుంది అని ఆమె చెప్పడం జరిగింది. బీడీ కార్మికుల,ఐక్యత, పోరాటం వల్లనే కూలీరేట్లు పెరిగాయనీ, బీడీ కార్మికుల కనీస వేతన జివోఅమలుకై, కొత్త చట్టం,లేబర్ కోడ్ల రద్దుకై పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పివోయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతి కార్మికులు శైలజ,లలిత, సుశీల,సంధ్య ,శ్రీదేవి, ద్వారక తదితరులు పాల్గొన్నారు.



## పద్మశాలి వంశ చరిత్రకు చిరస్థాయిగా నిలిచే గ్రంథావిష్కరణ.

### బోడుప్పల్‌లో ఘనంగా "పద్మశాలి వంశవృక్షం" ఆవిష్కరణ.

**బోడుప్పల్, మే 12: (ప్రజా తీర్పు)**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో డా. బొద్దుల రామచంద్రం రచించిన "పద్మశాలి వంశవృక్షం" గ్రంథం ఘనంగా ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మసన చెన్నప్ప చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నూటొక్క గోత్రాల గౌరవాన్ని ప్రపంచానికి చాటే విధంగా రూపొందిన ఈ గ్రంథం పద్మశాలి సమాజానికి ఆత్మగౌరవ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వంశ మూలాలు, ఇంటిపేర్లు, తరతరాల చరిత్రను ఒకే గ్రంథంలో సమగ్రంగా అందించడం ఎంతో అరుదైన కృషి అని కొనియాడారు. విశిష్ట అతిథులుగా వడ్డేపల్లి నర్సింగరావు, దోర్నాల విజయ్ కుమార్ పాల్గొనగా, ప్రత్యేక అతిథులుగా తోటకూర చందర్ యాదవ్, చీరాల నరసింహ, జక్కా రాములు, కౌడే పోచయ్య, సాయిని అమృతం, వెంకట స్వామి, పి.ఎల్. మధుసూదన్, వి. మురళీధర్ తదితరులు హాజరయ్యారు. అనంతరం డా. బొద్దుల రామచంద్రం మరియు ఆయన సతీమణి సుమీలలను ఘనంగా సత్కరించారు. రచయిత మాట్లాడుతూ, పద్మశాలి వంశ ప్రత్యేకత, గోత్రాల ఆధారంగా వంశవృక్ష వివరాలను సులభంగా తెలుసుకునే విధంగా ఈ గ్రంథాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, శ్రీనివాస నగర్ కాలనీ సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎన్యూమరేటర్లకు ఇచ్చిన ఏరియా పూర్తి చేయాలి...

### మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి

**జమ్మికుంట, మే 12 (ప్రజాతీర్పు)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న జనాభా నమోదు ఎన్యూమరేటర్లకు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటిని సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన 2026-27 జనాభా నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల ఎన్యూమరేట్లు మీ ఇంటికి వచ్చి జనాభా గణన నమోదు చేస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటికి వెళ్లి సెన్సెస్ వివరాలలో పొందుపర్చిన ప్రతి అంశాన్ని నింపి, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమం పూర్తి చేస్తారని, ఈ సర్వే పూర్తి కావడానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రనిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట టిపివో శ్రీధర్, టిపిబివో దీపిక, ఎన్యూమరేటర్లు పలువురు పాల్గొన్నారు.



## బండి సాయి భగీరద్ పై ఫోక్సో కేసు నమోదు చేసి. కఠినంగా శిక్షిశీచాలి

### బొమ్మర వరప్రసాద్ గౌడ్ బి ఆర్ స్ పార్టీ టేకులపల్లి మండల అధ్యక్షులు

**(పొనకంటి ఉపేందర్ రావుప్రజా తీర్పు టేకులపల్లి) మే 12**

టేకులపల్లి :కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్. కుమారుడు. భగీరద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కేసును నీరుకార్చేందుకు. ప్రయత్నం చేస్తున్న పోలీస్ ల పై విచారణజరుపలని భాధితురాలికుటుంబాన్ని వేధింపులకు గురించేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని. భాదితురాలికి నాయ్యం చేయాలనీ బి ఆర్ స్ టేకులపల్లి మండల కమిటీ డిమాండ్ చేస్తుంది బండి సాయి భగీరదు ను వెంటనే అరెస్ట్ చేయాలి లేనియెడల టేకులపల్లి లో నిరసన కార్యక్రమం చెపాడుతమని భాదితులు రాలికి నాయ్యం జరిగేనంతవరకు పోరాడుతామని. హెచ్చరించారు. ఈయొక్క కార్యక్రమంలో టేకులపల్లి మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్ సర్పంచ్ లు శివ కృష్ణ లకావత్ నాకా నాయక్ బి ఆర్ స్ మండల నాయకులు లక్కినేని. సురేందర్ రావు. అంగోత్ లక్ పతి భూక్యా. దళ్సింగ్ నాయక్ జాలది అప్పారావు కనకం శ్రీను తేజవత్ రవి బానోత్ రవి కుమార్ బానోత్ రామ నాయక్ నాగేశ్వర్ రావు వాసు భూక్యా లాలు నాయక్ నాగ భూషణం ఆమెడ రేణుక ఉప సర్పంచ్ లు.తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కందుల సమతా ప్రకాష్‌కు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే012**




మహేశ్వరం నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కందుల సమతా ప్రకాష్ పెళ్లిరోజు సందర్భంగా మహేశ్వరం మండల్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి పెంజర్ల యాదయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కందుల సమతా ప్రకాష్ నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుని ప్రార్థించారు. అలాగే మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్న,లక్ష్మారెడ్డి ఆశీస్సులు ఎల్లప్పుడూ వారికి ఉండాలని ఆకాంక్షించారు.

# ధాన్యం తరలింపునకు లారీలను సిద్ధం చేయాలి

- గంజాల్ టోల్‌ప్లాజా వద్ద కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 12(ప్రజాతీర్పు ):**



జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి, మొక్కజొన్న ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజా వద్ద లారీల సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. టోల్‌ప్లాజా మీదుగా వెళు న్న ఖాళీ లారీలను గుర్తించి, వాటిని ధాన్యం రవాణాకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీ డ్రైవర్లు, యజమానులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని వివరించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరగకుండా వెంటనే వాహనాలను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం మామడ మండలం న్యూ సాంగ్వి గ్రామ రహదారి వద్ద లారీల సేకరణ తీరును పరిశీలించిన కలెక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లారీల సేకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించాలని తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బందికి టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వాహనాలను ఆపిన వెంటనే సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమున్న కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యాన్నీ సహించబోమని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్లు సంతోష్, సరిత, శ్రీనివాస్, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరి లో 1.25 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మర్రి

**(వినోద్, ప్రజా తీర్పు,మల్కాజిగిరి) మే 12**

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం గౌతమ్ నగర్, మీర్జాల్గూడ ప్రాంతాలలో రూ. 1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా చిన్మయి మార్గం, మీర్జాల్గూడలో రూ. 40 లక్షల వ్యయంతో డ్రైన్ రీమోడలింగ్ పనులు, రాజ శ్రీనివాస్ నగర్‌లోని మనీషా అపార్ట్‌మెంట్స్ సమీపంలో రూ. 22 లక్షల వ్యయంతో, ఆర్‌సీసీ పైప్‌లైన్ నిర్మాణం, జ్యోతి నగర్ తీన్ కమాన్ సమీపంలో రూ. 35 లక్షల వ్యయంతో స్లాబ్ డ్రైన్ మరియు రోడ్డు ఎత్తు పెంపు పనులు, అన్నపూర్ణ కాలనీలో పార్క్ వ్యూ అబౌడ్ అపార్ట్‌మెంట్ వద్ద రూ. 28 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించబడ్డాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వర్షపు నీటి పారుదల, డ్రైనేజ్ మరియు రహదారి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి సర్కిల్ డీఈ లౌక్య, అసిస్టెంట్ ఇంజనీర్ దివ్య జ్యోతి, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, రావుల అంజయ్య, వీరేశం యాదవ్, జేఏసీ వెంకన్న, రాము యాదవ్, తోట నరేందర్ రెడ్డి, ఖలీల్, అరుణ్ రావు తదితరులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## కోతుల స్వైర విహారం...

**చిగురుమామిడి మే 12 (ప్రజాతీర్పు)**



చిగురుమామిడి మండలంలోని నవాబుపేటలో మంగళవారం కోతులు స్వైర విహారం చేశాయి. గ్రామానికి చెందిన అనుమాన్ల నరసయ్యపై కోతులు తన ఇంటి వద్ద దాడి చేసి తీవ్రంగా కరచి గాయపరిచాయి. అయితే గత రెండు రోజుల క్రితం నవాబుపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలకవర్గం ఆధ్వర్యంలో కోతులను పట్టించగా కోతులను పట్టేవారు పూర్తి స్థాయిలో కోతులను పట్టుకొని తీసుకెళ్ళకపోయారు. పిల్ల కోతులు మాత్రమే పట్టుకోగా తల్లి కోతులు గ్రామంలో వివిధ కాలనీల్లో తీవ్రం అరుస్తూ గ్రామస్తులపై దాడులు చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు బయటకు రోడ్లపైకి రావాలంటే భయాందోళన చెందుతున్నారు. కోపంలో కోతులు వచ్చి దాడిచేసే అవకాశం ఉందని గ్రామ పంచాయతీ పాలకవర్గం చొరవ తీసుకొని మిగిలిన కోతులను కూడా పట్టించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## కన్నుల పండుగగా రేణుక ఎల్లమ్మ జమదగ్నిల కళ్యాణ మహోత్సవం

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) మే 12**

వెల్జీపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ జాతర. మహోత్సవాన్నిపురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ జమదగ్నిల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘ సభ్యులుఅమ్మవారికి బోనాలు సమర్పించి. డప్పుచప్పులతోఊరేగించుకుంటూ వచ్చి మొక్కు అమ్మవారికి సమర్పించారు పాడిపంటలు వర్షాలు సమృద్ధిగా కురవాలని వెల్జీపురం గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో సుబీక్షంగా ఉండాలని వారు అమ్మవారికి గౌడ సంఘం ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించారు ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘ సభ్యులు కౌండిన్య యూత్ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ జన సమితి ప్లీనరీలో దివ్యాంగుల తీర్మానాలు ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ కోదండరాం

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) మే, 12**

ఎమ్మెల్సీ తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం సార్ ని కలిసిన విశ్వవిద్యాలయాల వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నకరకంటి అశోక్, ఉపాధ్యక్షులు మారవేణి చంద్రశేఖర్ యాదవ్, కోశాధికారి పాల్వాయి బుచ్చిరాములు కార్యవర్గ సభ్యులు ఉపేందర్ కలిసి నెక్లెస్ రోడ్ లో జరగనున్న తెలంగాణ జన సమితి నాలుగవ ప్లీనరీ సమావేశంలో దివ్యాంగుల తీర్మానాలను ప్రవేశపెట్టాలని కోదండరాం సార్ దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే, స్పందించిన ఆయన తప్పకుండా ప్లీనరీలో చర్చించి తీర్మానాలు ప్రవేశపెడతామని హామీ ఇవ్వడం జరిగింది. నేడు నెక్లెస్ రోడ్ లో జరిగిన నాలుగవ ప్లీనరీ సమావేశంలో తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరాం సార్ వికలాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం తీర్మానాలను ప్రవేశ పెట్టడం జరిగింది.

# మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకూడదు

### రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 12(ప్రజాతీర్పు ):**



మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హమాలీలు, గన్ని సంచులు, ధాన్యం తరలింపునకు లారీలు, ధాన్యం నిల్వ చేయడానికి తగిన స్థలాల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం సరఫరాకు అవసరమైతే లారీలతో పాటుగా ట్రాక్టర్లను కూడా వినియోగించుకోవాలన్నారు. ధాన్యం తరలింపుకు సంబంధించి లారీల కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియకు అవసరమైతే స్థానిక హమాలీలను నియమించుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారికి రశీదులు ఇవ్వాలన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు తమ పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్లందరూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలిగితే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న, వరి పంటల కొనుగోలు సాఫీగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి అన్లోడింగ్ పాయింట్ లు దగ్గర్లో ఉంటే ట్రాక్టర్ల ద్వారా ధాన్యం సంచులు తరలించే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచులు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు. ధాన్యం తూకం, తరలింపులో ఎట్టి పరిస్థితుల్లో రైతుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని హెచ్చరించారు. ఈ వీసీ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి





## రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 12**

రాష్ట్రంలోని రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), తుమ్మల నాగేశ్వర్ రావు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రభుత్వ నిర్దేశిత విధానాల ప్రకారం సజావుగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ధాన్యం రవాణాలో జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు, టార్పాలిన్లు, క్లీనింగ్ మెషీన్లు, ఇతర అవసరమైన పరికరాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హమాలీల సమస్యలు రాష్ట్రంలో ఎక్కడ తలెత్తకుండా గుత్తేదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహించిన పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలలో లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు పూర్తి చేయాలని, సమస్యలు ఉన్న కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద గ్రామ స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించాలని తెలిపారు. ప్రతి జిల్లాలో కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గోదాములు అందుబాటులో లేని ప్రాంతాలలో తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లు వంటి ప్రదేశాల్లో ధాన్యాన్ని నిల్వ ఉంచే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. లారీలు అందుబాటులో లేని చోట ట్రాక్టర్లు, ఇతర రవాణా వాహనాలను వినియోగించి ధాన్యం రవాణా చేయాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ రైతులకు తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రతికూల వార్తలు వెలువడిన సందర్భంలో వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ల పేరుతో వెంటనే రిజాయిండర్లు విడుదల చేయాలని సూచించారు. వరిధాన్యం కొనుగోలు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల ద్వారానే జరగాలని, నేరుగా మిల్లులకు తరలించే చర్యలు చేపట్టవద్దని మిల్లర్లకు వివరించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టోకెన్ వ్యవస్థ, రసీదు విధానం ప్రభుత్వ నిర్దేశిత విధానాల ప్రకారం అమలు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌర సరఫరా అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సహకార అధికారి సత్యనారాయణ లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా ప్రతిరోజూ నివేదికలు పంపించాలని, క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తూ కొనుగోళ్లు సజావుగా కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా కొనుగోలు చేసిన వెంటనే కేటాయించిన ప్రకారంగా గోదాములు, రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, లారీలతో పాటు ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ప్రభుత్వ నిర్దేశిత విధానాలను అవలంబించాలని తెలిపారు. లారీలు, హమాలీ కొరత లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**(నారుకట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) మే 12**

బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. మంగళవారం రోజున వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించి ,కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి,చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లపై,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను కఠినతరం చేసి,వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ సమగ్ర భద్రతను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్ పరిధిలో తరచూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,వాహనదారులుకు హెల్మెట్,సీట్‌బెల్ట్ వినియోగం,మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలు, మైనర్ డ్రైవింగ్ లపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను, వ్యాపారస్తులను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్పీ గారి వెంట డిఎస్పీ శ్రీనివాసులు,సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ వెంకట్రాజం,సిబ్బంది ఉన్నారు.




## గంజాయి నిర్మూలనపై బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసుల ప్రత్యేక చర్యలు

- నార్కోటిక్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన నలుగురిపై కేసులు నమోదు
- డి-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 12**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా, నిల్వ,సరఫరా నిర్మూలనతో పాటు నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గతంలో గంజాయి రవాణా కేసుల్లో,నిందితులుగా ఉన్న ఆరుగురు వ్యక్తులను బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం నార్కోటిక్ పరీక్షల నిమిత్తం వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, యూరిన్ టెస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. అందులో నలుగురు వ్యక్తులు పాజిటివ్‌గా తేలినట్లు గుర్తించారు.

**వారి వివరాలు :**

1. ఎస్కే జమీర్, తండ్రి మహబూబ్, వయస్సు 26 సం, వృత్తి చేపల వ్యాపారి, నివాసం బెల్లంపల్లి బస్తీ, బెల్లంపల్లి. 2. ఆర్. ఎమ్‌డీ తాజ్ బాబా, తండ్రి ఎస్కే కలీం, వయస్సు 20 సం, వృత్తి కూలీ, నివాసం వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతం, బెల్లంపల్లి. 3. ఎస్కే కలీం, తండ్రి ఎస్కే మహబూబ్, వయస్సు 30 సం, వృత్తి కూరగాయల వ్యాపారి, నివాసం వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతం, బెల్లంపల్లి. 4. తోట మనీదీప్, తండ్రి శేఖర్, వయస్సు 21 సం, వృత్తి డ్రైవర్, నివాసం 65 డిప్ ప్రాంతం, బెల్లంపల్లి. దీంతో వెంటనే వారిని తిరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టపరమైన కేసులు నమోదు చేశారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా,కోర్టు ఆదేశాల మేరకు వారిని 15 రోజుల పాటు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ,మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని పేర్కొన్నారు.మత్తు పదార్థాలకు బానిసైన వారిని చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచేందుకు ప్రత్యేక కౌన్సిలింగ్,వైద్య పరీక్షలు,అవసరమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు.గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల రవాణా, నిల్వ,వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సమీక్ష సమావేశం

- పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లక్ష్యం: పుల్కం రాజు

**( కవ్వాల సురేందర్, ప్రజా తీర్పు, వేములవాడ) మే 12**



:వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై మంగళవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మరియు ఇంచార్జ్ కమిషనర్ సంపత్ రెడ్డి, వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ?ఒక గూడు అనేది పేద కుటుంబానికి ఇచ్చే అతిపెద్ద సామాజిక భరోసా అని, ఈ పథకం ద్వారా లబ్ధిదారులు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నిధులు సకాలంలో అందేలా చూడాలని, నిర్మాణ దశల్లో వారికి అవసరమైన సాంకేతిక సలహాలు అందిస్తూ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా చూడటమే మన లక్ష్యమని పుల్కం రాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ మాలతి, హౌసింగ్ ఏఈ సౌజన్య, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.



## స్వామి వివేక్‌పటేల్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 12:**

రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి చికిత్స పొందుతున్న ఆకుల స్వామి వివేక్ పటేల్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పి చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్‌పటేల్ ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన స్వామికి ధైర్యం చెప్పి, బాధితుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు మాజీ కౌన్సిలర్లు పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ తదితరులున్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

- ఆశా నోడల్ సూపర్‌వైజర్లకు డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ సూచనలు
- పెద్దపల్లిలో సమీక్ష సమావేశం

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 12 :**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా ఆశా కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్‌కుమార్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశా నోడల్ సూపర్‌వైజర్లతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణీ స్త్రీలను ప్రారంభ దశలోనే నమోదు చేసి, వారికి నిరంతర వైద్య సేవలు అందేలా చూడాలని తెలిపారు. గర్భిణులను పరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రామగుండం, ఇతర కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తరలించే సమయంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు కూడా వెంట వెళ్లాలని సూచించారు. 102 వాహన సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, బర్త్ ప్లాన్ ప్రకారం గర్భిణులకు అదే వైద్య కేంద్రంలో ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పీసీవీ టీకాలను లక్ష్యాలకు అనుగుణంగా సంబంధిత కేంద్రాల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను గడువులోపు పూర్తి చేయాలని, క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ శిబిర్ ఫేజ్-2 కింద అనుమానిత లక్షణాలు ఉన్నవారికి, సున్నిత వర్గాల ప్రజలకు టీబీ స్క్రీనింగ్, కఫ పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ నివారణ చర్యలు చేపట్టాలని, ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచే దిశగా ఆశా కార్యకర్తలు పనిచేయాలని నోడల్ సూపర్‌వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ బి. శ్రీరాములు, డాక్టర్ వి. వాణిశ్రీ, డాక్టర్ కె.వి. సుధాకర్ రెడ్డి, డాక్టర్ బి. కిరణ్‌కుమార్, జిల్లా ఆశా నోడల్ అధికారి దయామణి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 13 కేంద్రాల్లో 5,078 మంది విద్యార్థులు హాజరు
- పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**(దుర్గం నగేష్ ,ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్, మే 12:**

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 13 నుంచి 21 వరకు నిర్వహించే ఈ పరీక్షలు రెండు విడతల్లో జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని 13 పరీక్ష కేంద్రాల్లో ఫస్ట్ ఇయర్‌కు చెందిన 3,664 మంది, సెకండ్ ఇయర్‌కు చెందిన 1,414 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 5,078 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఇద్దరు డీఈసీ సభ్యులు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, ఒక కస్టోడియన్‌ను నియమించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక బస్సు మార్గాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లో సరైన వెలుతురు, తాగునీటి సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకుని నిబంధనలు పాటించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూచించారు.

## మహిళా సంఘాల సభ్యులకు పాడి పశువుల పథకం రుణాలు

**చిగురుమామిడి మే 12 (ప్రజా తీర్పు)**



జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో చిగురుమామిడి మండలంలోని షెడ్యూల్ కులాల మహిళా సంఘాల సభ్యురాళ్లకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు కరీంనగర్ జిల్లా కార్య నిర్వహణ సంచాలకుడు వై.తిరుపతి రావు పేర్కొన్నారని చిగురుమామిడి ఎంపిడిఓ విజయ్ కుమార్ తెలిపారు.డిఎస్ సి ఎస్ సి డి ఎస్ లిమిటెడ్ లోని పాడి పరిశ్రమలో వాటాదారులుగా ఉన్న షెడ్యూల్ కులాలకు చెందిన ఎస్ హెచ్ జి సభ్యులకు పాడి పశువుల కొనుగోలు నిమిత్తం రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.కాబట్టి మండలంలోని ఆయా గ్రామాల మహిళా సంఘాల ఎస్ హెచ్ జి సభ్యురాళ్ళు సంబధిత గ్రామాల సిఎలను లేదా మండల పరిషత్ ప్రజా భవన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



# ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులు లేకుండా చూడాలి

- గ్రామీణ ప్రాంత మస్జిద్ ఇమామ్, అధ్యక్షుల సదస్సులో
- ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 12**

చట్టాలను గౌరవిస్తూ, దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆవులను వధించకూడదని, ప్రభుత్వం నిషేధం విధించినపుడు, నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పుడు నిబంధనలు ఉల్లంఘించకూడదని మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రేకుర్తి మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ ప్రిన్సిపాల్ ముఫ్తి మహమ్మద్ ఖియాస్ మొహియుద్దీన్ యావత్తు ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని రేకుర్తి షేక్ ఖాన్ నగర్ మస్జిద్ లో మజ్లీస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రాంత ముస్లింలు, ఇమామ్, మస్జిద్ అధ్యక్షుల అవగాహన సదస్సులో ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ త్వరలో పవిత్ర బక్రీద్ మాసం రాబోవుతుందని, బక్రీద్ మాసంలో ఖుర్బానీ (బలి) ఇచ్చే జంతువుల్లో ఆవులను వధించకూడదని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి సున్నిత విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇస్లాం ధర్మం ప్రకారం మనం చేసే పనులు, కార్యక్రమాలతో సమాజంలో నివసించే ఇతర ధర్మం ప్రజల మనోభావాలకు ఇబ్బంది కలుగకుండా ఉండాలని, ఆవిధంగా జీవించాలని మహానీయ మహమ్మద్ ప్రవక్త (సల్లం) సెలవిచ్చారని పేర్కొన్నారు. ఇస్లాం సంస్కృతి, సాంప్రదాయలకు పెట్టింది పేరని, ఇస్లాంకు విరుద్ధంగా ప్రవర్తించడానికి వీలు లేదన్నారు. బక్రీద్ లో పరిసరాల పరిశుభ్రతను విధిగా పాటించాలని కోరారు. బక్రీద్ మాసం దృష్ట్యా గోవులను ఈనెల రోజుల పాటు వార సంతల్లో విక్రయించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతిలోకి తీసుకొని దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ హిఫ్జి కలీమ్ షరీఫ్ ఇమ్రాన్ బేగ్ తౌహీద్ అబ్దుల్ రాఫె ముఫ్తి జుబేర్ హాఫిజ్ ఫరీదొద్దీన్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరాం ను పలు సమస్యలపై కలిసిన ఉద్యమ నాయకుడు ఈడిగి సంజయ్య గౌడ్

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) మే, 12**



తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం సార్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల నాయకుడు ఈడిగి సంజయ్ గౌడ్. ఈ సందర్భంగా ఈడిగి సంజయ్ గౌడ్ మాట్లాడుతూ.. నేడు హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డులో జరిగే తెలంగాణ జన సమితి పార్టీ నాలుగో ప్లీనరీ సమావేశంలో నిరుద్యోగ సమస్య, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సమస్యల పరిష్కారం, తెలంగాణ ఉద్యమకారుల హామీలు అమలు, ఆదివాసిల, గిరిజన పోడు భూముల రైతుల గూర్చి, రైతుల కష్టాల పైన చర్చించాలని విన్నవించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తానన్న కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం ఉద్యమకారులపై పెట్టినక్కి అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవత ఏర్పాటు కొత్తలో తెలంగాణ రాష్ట్ర డిజిపిని ఆదేశించడం జరిగింది. కానీ ఇంతవరకు కూడా బుజ్జమ్మకాలపై ఉన్న కేసులు ఎచివేయలేదు ఉద్యమకారులకు హెల్త్ కార్డులు ఉచిత బస్ పాస్ సౌకర్యం నిజమకారుల పింఛన్ కూడా ఇవ్వాలని ఈ విషయాలపై నాలుగో ప్లీనరీలో చర్చించారని కోరడం జరిగింది.

# భగీరథ్ వ్యవహారంలో బీజేపీ - - కాంగ్రెస్ ఒక్కటయ్యాయి

## బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య

**చిగురు మామిడి మే 12 (ప్రజాతీర్పు)**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్‌పై నమోదైన పోక్సో కేసు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ ప్రజలపై అయితే వెంటనే చర్యలు తీసుకునే ప్రభుత్వం, అధికార పార్టీలకు సంబంధించిన వ్యక్తుల విషయంలో మాత్రం మౌనం పాటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. గత మూడు రోజులుగా ఈ అత్యంత తీవ్రమైన పోక్సో కేసుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. మహిళల భద్రత, బాలికల రక్షణ గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పే కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు. “ఇద్దరూ ఒకే కులానికి చెందినవారు కాబట్టి పెళ్లి చేయండి లేదా సెటిల్‌మెంట్ చేసుకోండి” అని మాట్లాడటం ఒక మంత్రికి తగిన మాటలా అని ప్రశ్నించారు. పోక్సో కేసు అనేది రాజీ చేసుకునే పంచాయితీ విషయం కాదని, ఇది మైనర్ బాలికపై జరిగిన తీవ్రమైన లైంగిక నేరమని స్పష్టం చేశారు. ఒకవైపు మహిళల రక్షణ పేరుతో సభల్లో ప్రసంగాలు చేస్తూ, మరోవైపు అధికార పార్టీలకు చెందిన వారి విషయంలో మాత్రం సెటిల్‌మెంట్ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ అసలు ముఖాన్ని బయటపెడుతోందన్నారు. నిందితుడు సామాన్య కుటుంబానికి చెందినవాడై ఉంటే ఇప్పటికి అరెస్ట్ చేసి మీడియా ముందు పరేడ్ చేసేవారని, కానీ అధికార అహంకారంతో చట్టాన్ని తమ జేబులో పెట్టుకున్నట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయకుండా నాలుగు రోజుల సమయం ఇవ్వడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. పోలీస్ వ్యవస్థను రాజకీయ నాయకుల రక్షణ కోసం ఉపయోగించడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. అసలు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందా లేక బీజేపీ ప్రభుత్వం నడుస్తుందా లేక రెండు కలిసి రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాయా అర్థం కాకా ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారు అని అన్నారు. బండి సంజయ్ కొడుకును అరెస్ట్ చేసి బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలి నిజంగా బీజేపీ భారతమాతను తల్లిగా భావిస్తే బండి సంజయ్ సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేసారు.మైనర్ బాధితురాలికి తక్షణమే న్యాయం చేయాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఆపదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని మామిడి అంజయ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మామిడి అంజయ్యతో పాటు మండల మాజీ అధ్యక్షులు రామోజు కృష్ణమాచారి, సీనియర్ నాయకులు మహంకాళి కొమురయ్య గీట్ల తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జి రవీందర్ పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ ఫాసిస్టు పాలనలో రైతుల బ్రతుకులు దినదిన గండంగా మారుతున్నాయి

## మాజీ ఎంపీ వడ్డె శోభనాద్రి శ్వరరావు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు టేకులపల్లి) మే 12**




ఇల్లందు :ప్రభుత్వ రంగాలను నిర్వీర్యపరిచి దేశాన్ని దోచుకునే కార్పొరేట్ శక్తుల పక్షాన కేంద్ర ప్రభుత్వం పని చేస్తున్నదని మాజీ ఎంపీ రైతు నాయకులు వడ్డె శోభనాద్రిశ్వరావు అన్నారు. మంగళవారం అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ వ్యవస్థాపక సభలను ప్రారంభిస్తూ ఆయన ఇల్లందు పట్టణంలో రాయల చంద్రశేఖర్ ప్రాంగణంలో జరిగిన ( అయితా ఫంక్షన్ హాల్) మహాసభలలో ప్రతినిధుల ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మహాసభల ప్రారంభానికి ముందు చంద్ర కృష్ణమూర్తి ట్రస్ట్ భవన్ వద్ద ఏర్పాటుచేసిన జెండాను ఏఐయుకేఎస్ జాతీయ నాయకులు ప్రదీప్ సింగ్ ఠాగూర్ ఎగరవేశారు. ఓ అరుణ పతాకమా నీకివిగో రెడ్ సెల్యూట్ శ్రమజీవుల కేతనమా నీకివిగో రెడ్ సెల్యూట్ అంటూ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అమరవీరుల సంతాప తీర్మానం బి.రాము ప్రవేశ పెట్టారు.అనంతరం ప్రారంభమైన ప్రతినిధుల సభకు అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి అధ్యక్షత వహించగా మాజీ ఎంపీ వడ్డె శోభనాద్రిశ్వరరావు మాట్లాడుతూ పారిశ్రామిక ఉత్పత్తులకు ధరలు నిర్ణయించినట్లుగానే వ్యవసాయ ఉత్పత్తులకు కూడా సమగ్ర ఉత్పత్తి ఖర్చుల ప్రాతిపదిక ప్రకారం ధరలు నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 2014 సంవత్సరం ముందు నాలుగు లక్షల మంది రైతులు వ్యవసాయంలో నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడినారని,ఆ తర్వాత లక్ష 30 వేలమంది బలవన్మరణాలకు పాల్పడినారని అయినా మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని అన్నారు. మోడీ ప్రభుత్వం రైతుల మేలుకోరి చేసింది ఏమీ లేదని అన్నారు. ఇప్పటి వరకు మోడీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్లకు 16 లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందని, 80 వేల కోట్లు ఉద్దేశపూర్వకంగా బ్యాంకు లోన్లు ఎగొట్టిన గుత్త పెట్టుబడిదారుల పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనిల్,అంబానీ లాంటివాళ్ళు ఆకోవలోకే వస్తారని చెప్పారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలకై వ్యవసాయ రంగ రక్షణ కొరకు రైతులు దేశంలో పోరాడుతున్నారని చెప్పారు. వారిని అణచివేసే విధానాల్లో భాగంగానే విభజించు పాలించనే పద్ధతుల్లో మత విభజనకు మోడీ పాల్పడుతున్నారని అన్నారు. బిజెపి లాంటి పార్టీలు దేశ ప్రగతికి వ్యతిరేకమని,దేశ ప్రజాస్వామ్యానికి,రాజ్యాంగ హక్కులకు కూడా వ్యతిరేకమని చెప్పారు. ప్రజాపాలనకు బదులు మనుధర్మ సూత్రాల అమలును వారు ప్రాధాన్యతగా పెట్టుకున్నారని చెప్పారు. ఇప్పటివరకు బిజెపికి 2/3 మెజారిటీ రాలేదని 2029లో అధికారంలోకి వస్తే దేశంలోని ప్రజాస్వామ్యం సిగ్గుతో తల ఒంచుకోక తప్పదని అన్నారు.మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి ప్రసాద్ మాట్లాడుతూఅఖిలభారత ఐక్య రైతు వ్యవస్థాపక మహాసభలు ఇల్లందులో జరగడం చారిత్రాత్మకంగా మహాసభల ప్రాధాన్యత ఉంటుందని ఈ మహాసభలకు హాజరైన దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన రైతు ప్రతినిధులు,రైతు సంఘం నాయకులు, ఉద్యమకారులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, మేధావులు, వ్యవసాయ రంగ నిపుణులు, రైతు సోదర సోదరీమణులకు విప్లవ స్వాగతం పలికారు. ఇల్లందు నేల సాధారణ భౌగోళికప్రాంతంకాదని,దొరన్న, బాటన్న, ఎల్లన్న, కోటన్న, రాయల చంద్రశేఖర్ అన్నలతో పాటు వందల మంది విప్లవకారులు తమ అమరత్వంతో ఎరుపెక్కిన నేల ఇల్లందు అని అన్నారు. తమ పోరాట పంథాతో వేలాది ఎకరాల పోడు భూములను ఈ ప్రాంత పేద ప్రజలకు సాధించి పెట్టారు. నల్లబంగారంగా పేరొందిన బొగ్గు గనులకు పుట్టినిల్లు ఇల్లంద అని బొగ్గు గని కార్మికులు సైతం తమ సమస్యల పరిష్కారం కోసం వీరోచిత పోరాటాలు చేశారని తెలిపారు.ఇలా ఇల్లందు విప్లవ పోరాటాల చరిత్ర కలిగిన నేల ప్రజా చైతన్యంతో విప్లవ పోరాటాలు నిర్మించిన చరిత్ర ఇల్లందు ప్రజలదని,కార్మిక ఉద్యమాలు,రైతంగ పోరాటాలు,తునికాకు కార్మికుల సమ్మెలు,కష్టజీవుల హక్కుల కోసం సాగిన చరిత్రకు ఈ నేల సాక్ష్యం అని తెలిపారు.అన్యాయం,దోపిడీ అణిచివేతలకు ప్రజా పందా మార్గంలో ఎదురు నిలిచిన పోరాట స్ఫూర్తి ప్రాంతం మట్టిలో ఉన్నదని అన్నారు.అంతటి చైతన్యం కలిగిన ప్రజలు ఉన్నారు కాబట్టే ఒక విప్లవ పార్టీ అభ్యర్థి గుమ్మడి నరసయ్యను ఐదు సార్లు గెలిపించచి అసెంబ్లీకి పంపారని అన్నారు.ఇలాంటి చారిత్రాత్మక ప్రాంతం లో రైతాంగా ప్రత్యేకత మహాసభలు జరగడం ఎంతో గర్వకారణంగా ఉందని ఆయన సందేశం ఇచ్చారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నేతకేజీ రామ చంద్ర రావు దేశంలో పెట్టుబడిదారీ దోపిడీ కొనసాగుతుందని వ్యవసాయ రంగం పూర్తిగా పెట్టుబడిదారులు ఎరువులు విత్తనాలు విరివిగా పెంచి దోచుకుంటున్నారని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుదారులు కూడా పెట్టుబడిదారులేనని అన్నారు. వీరు మరింత చౌకగా అమలు చేస్తున్నారని తెలిపారు. దానివలన వ్యవసాయం నష్టాలపాలుఅవుతున్నదని, రైతాంగం వ్యవసాయం నుండి దూరమైతే కార్పొరేట్ వ్యవసాయం అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం పెట్టుబడిదారులు భావిస్తున్నారని తెలిపారు. వ్యవసాయం చేసే రైతులు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతినిధుల సభలో సౌహర్థ సందేశాలు బి కే యు హర్నీక్ సీంగ్ మహిమ్,కే కే యు నాయకులు శశికాంత్ ఇచ్చారు. సోదర సంఘాలైన జాతీయ నాయకులు ఉమాకాంత్, ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి పి,రామకృష్ణ, టి పి టి ఎఫ్ నాయకులు మనోహర్ రాజు, పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి శిరోమణి, పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర బిచ్చ, పి వై ఎల్ రాష్ట్ర కార్యదర్శి పి రామకృష్ణ సందేశం ఇచ్చారు. విదేశం లో ఉన్న వి.ప్రభాకర్ సందేశం పంపారు.




# 4 పెళ్లిళ్లు చేసిన వారికి అవార్డుల ప్రధానోత్సవం:

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు మంచిర్యాల మండల్) మే12**

తెలంగాణ సంతోషి మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నాలుగు పెళ్లిళు చేసిన మ్యారేజ్ బ్యూరో సభ్యులకి షీల్డ్ మరియు శాలువాలతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమం చైర్మన్ కండె సుశీల ఆధ్వర్యంలో జరిగింది ముఖ్య అతిథిగా ఆల్ క్యాస్ట్ మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం హనుమంతరావు హాజరైనారు నాలుగు పెళ్లిలు జరిపించిన వారికి ఫీల్డ్ తో పాటు శాలువాలతో సన్మానించినారు మ్యారేజ్ బ్యూరో అంటే కేవలం సాఫ్ట్వేర్, గవర్నమెంట్ ,ప్రైవేటు ఉద్యోగస్తులకు సంబంధాలు చూడడం కాకుండా సుమారు 60 సంవత్సరాల వారికి కూడా తోడు నీడ గా వారికి జోడిని జత చేయడం జరుగుతుంది మ్యారేజ్ బ్యూరో నిర్వహిస్తూ మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న తెలంగాణ సంతోషి మ్యారేజ్ బ్యూరో సంస్థ నుండి సుమారుగా 30 మంది సభ్యులు 4, పెళ్లిలు చేసి ఫీల్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని గ్రూప్ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు గ్రూప్ గజ్జల మల్లేష్, లక్ష్మీనారాయణ, మామిడిపల్లి శ్రీనివాస్ రోజా, సౌమ్య, జ్యోత్స్న, చందు ల తో పాటు పురుషులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# హనుమాన్ జయంతి సందర్భంగాప్రసాద వితరణ

**రామడుగు, మే 12 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం (షాపురం గుడి) వద్ద మంగళవారం హనుమాన్ జయంతి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన పులిహోరను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పులిహోర, లడ్డూలు, పండ్లు, బెల్లం వంటి నైవేద్యాలను స్వామివారికి సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. స్వామికి పులిహోర సమర్పించడం వల్ల బలం, ఓర్పు, ఆధ్యాత్మిక శక్తి లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎండీ మోయిజ్, పంతులు సుదర్శనం వేణు, హనుమాన్ కమిటీ అధ్యక్షుడు చిలువేరు కనుకయ్య, ఉపాధ్యక్షుడు కడారి శ్రీనివాస్, క్యాషియర్ జవ్వాజి అజయ్, ప్రధాన కార్యదర్శి సముద్రాల రమేష్, సభ్యులు పురేళ్ల తిరుపతి, ఇరేళ్ల అంజయ్య, సముద్రాల రవి, బాసవేని శ్రవణ్, బాసవేని మదు, నీలం ప్రశాంత్, చిట్యాల అజయ్, పురేళ్ల మణి తదితర భక్తులు పాల్గొన్నారు.

# తెలుగు విశ్వవిద్యాలయంలో యోగా కోర్సులు

- ఒప్పందం కుదుర్చుకున్న భారత్ స్వాభిమాన్ ట్రస్ట్
- విద్య, కార్పొరేట్ సంస్థల్లో యోగ టీచర్లకు డిమాండ్
- భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ సంఘటన కార్యదర్శి నందనం కృపాకర్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 12**



యోగాలో డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులను అందిస్తున్నట్లు భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ సంఘటన కార్యదర్శి నందనం కృపాకర్ తెలిపారు. ఈ మేరకు సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని చెప్పారు. పతంజలి యోగ సమితి భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ తెలంగాణ గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రమంతా నిత్యం యోగా తరగతులు నిర్వహిస్తూ వేలాదిమందికి ఉచితంగా శిక్షణ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విద్య,కార్పొరేట్ సంస్థల్లో పెరుగుతున్న యోగ టీచర్ల అవసరాన్ని దృష్టిలోపెట్టుకుని ప్రామాణిక పద్ధతిలో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు విస్తృతంగా కల్పించాలనే సంకల్పంతో పలు యోగ కోర్సులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అసిస్టెంట్ యోగ టీచర్ కేటగిరిలో యువతకు వంద గంటలపాటు శిక్షణ ఇచ్చి తదుపరి ప్రాక్టికల్ పరీక్ష, రాత పరీక్షలు నిర్వహిశీచి పతంజలి యోగ పీట్ నుండి సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. యోగ టీచర్ గా స్థిరపడి యోగసేవ కూడా చేసే వారికి ముఖ్య యోగ శిక్షకుల శిక్షణను పతంజలి యోగ పీట్ హరిద్వార్ పర్యవేక్షణలో అందిస్తామని, ఇలా శిక్షణ పొందిన వ్యక్తులు రోజు రెండు గంటలు ఉచిత యోగసేవలు సమాజానికి అందించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. వైసీబి కోర్సులను లెవెల్ 1 నుండి 4 వరకు శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహిశీచి ఆయుష్ డిపార్ట్మెంట్, యోగ సర్టిఫికేషన్ బోర్డు ద్వారా సర్టిఫికెట్ అందిస్తామని వివరించారు. ఇప్పటివరకు 22 బ్యాచులకు శిక్షణ ఇచ్చామని కృపాకర్ అన్నారు. పై రెండు కోర్సులు చేసిన వందలాదిమంది పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, పీఎం శ్రీ స్కూళ్ళు, సీబీఎస్ఈ స్కూళ్ళు, ఆయుష్ విభాగం ఆరోగ్య కేంద్రాల్లో ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కృపాకర్ తెలిపారు. అయితే ఈ నియామకాలకు సంబంధించి ఏదైన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ, డిప్లొమా, పీజీడిప్లొమా అడుగుతున్నారని, అందులో భాగంగానే సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని చెప్పారు. గతంలో ఈ కోర్సులను వివిధ రాష్ట్రాలకు వెళ్లి చేయాల్సి వచ్చేదని, ఇకనుండి ఇక్కడే వాటిని పూర్తి చేయవచ్చని తెలిపారు.

# తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే






- కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం
- కరీంనగర్ "హిందూ ఏక్తా యాత్ర"లో కేంద్ర మంత్రి బండి సంజయ్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 12**

"ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. నిజానిజాలు కోర్టులు తేలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం. చట్టానికి కట్టుబడి ఉన్నా"అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. "సమాజమే నా కుటుంబమని భావించి జీవితమంతా సమాజం కోసమే పనిచేసిన. ఏ ఇంట్లో కష్టమొచ్చినా పెద్ద కొడుకునై అండగా ఉన్నా. కానీ కొడుకుకు టైమివ్వలేకపోయా. జరుగుతున్న పరిణామాలకు తప్పు నాదే. క్షమించండి" అని తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేశారు. జీవితాంతంనా బాటలోనే నడిచిన నా భార్య కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా చేతనైనంత సాయం చేసిందని, ఈరోజు కన్న పేగునే క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను భయపడేది లేదని స్పష్టం చేసిన బండి సంజయ్ "నన్ను కెలికారు. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహించి వేస్తా. అవినీతి గడీలను బద్దలు కొడతా"అని అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కరీంనగర్ లోని వైశ్యాభవన్ నుండి "హిందూ ఏక్తా యాత్ర" ప్రారంభమైంది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ఏక్తా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలాది మంది ఈ యాత్రకు తరలివచ్చారు. వేలాది మంది కాషాయ శ్రేణులతో కరీంనగర్ జన సంద్రమైంది. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బండి సంజయ్ ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యంశాలు. ఈ లైట్ల ఫోకస్ ఎక్కువైంది. నేను మాట్లాడుతుంటే లైట్ల కాంతికి కళ్లల్లో నీళ్లు వస్తే ఏడుస్తున్నానని అనుకునేరు. నేను భయపడ. బండి సంజయ్ కంట తడి పెట్టే రకంకాదు. టవర్ సర్కిల్ పై కాషాయ జెండాను ఎగరేశాం. కరీంనగర్ ప్రజలకు హ్యాట్సాఫ్. హిందువుల ఐక్యతను చాటేందుకే 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర చేస్తున్నా. జై శ్రీరాం అనే నినాదమే హిందూ ధర్మాన్ని కాపాడుతుంది. హిందూ సమాజానికి ఆపదొస్తే జై శ్రీరాం నినాదంతో తెగించి కొట్లాడతాం. కరీంనగర్ గడ్డ రక్తం నాలో ప్రవహిస్తుంది. కరీంనగర్ లో గల్లీగల్లీలో ప్రజా సమస్యలపై కొట్లాడిన. చిన్న కార్యకర్తగా మొదలైంది నా ప్రస్తానం. నా జీవితం కష్టాలు, బాధలే. బాధలను చూసి భయపడి పారిపోయేటోడ్ని కాను. మీరే నా కుటుంబం. సమాజమే నా ఇల్లు అనుకున్న. హార్ట్ లో స్టంట్ ఉన్నా హార్ట్ ఫుల్ గా 1600 కి.మీలు నడిచిన. తెలంగాణ ప్రజల కష్టాలను పంచుకున్న. నాటి పాలకులు నాపై రాళ్ల దాడి చేసినా, 109 కేసులు పెట్టి జైలుకు పంపినా భయపడలే. ఏ హిందువుకు ఆపదొచ్చినా అండగా ఉన్నా. మీ ఇంట్లో పెద్ద కొడుకునైన. నా టైమంతా సమాజానికే ఇచ్చిన. నా కొడుకుకు టైమియ్యలేకపోయిన. నా కొడుకును క్రిమినల్ గా చూపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. అయినా నా కొడుకును నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా భార్య సైతం నన్ను ఫాలో అవుతోంది. నేనున్నా లేకున్నా కార్యకర్తలకు చేతనైనంత సాయం చేస్తోంది. ఈరోజు నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతి వ్యవస్థను దగ్ధం చేస్తా. అవినీతి, కుట్రలు చేసే గడీల బద్దలు కొడతా. నన్ను, నా కుటుంబాన్ని, నా కార్యకర్తలను ఇబ్బంది పెట్టినోడిని విడిచి పెట్టే ప్రసక్తే లేదు. బండి సంజయ్ భయపడే ప్రసక్తే లేదు. కాషాయ జెండా పట్టి కష్టాలు పడుతూనే ఉన్నా. అయినా బాధపడను, ధర్మం కోసం పోరాడుతూనే ఉన్నా. నా కొడుకుకు టైమివ్వకుండా నేను తప్పు చేసిన. తప్పు నాదే నన్ను క్షమించండి. తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. నిరూపించుకోవాలని చెప్పిన. నా చివరి శ్వాస వరకు హిందూ ధర్మం కోసమే పనిచేస్తా. ఇయాళ నా కొడుకుపై జరుగుతున్న దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది. నా కొడుకు సంఘటన మమ్ముల్ని ఇబ్బంది పెడుతుంటే 29 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటుంటే ఆ కుటుంబాలు పడుతున్న క్షోభ గుర్తుకొస్తోంది. శ్రీరామ చంద్రుడికే కష్టాలు తప్పలేదు. శ్రీరామచంద్రుడే నాకు ఆదర్శం. కష్టాలు భరిస్తా. ఆనాడు రాక్షసులు ఆంజనేయస్వామికి నిప్పంటిస్తే ఏమైంది? లంకా దహనమైంది. నేను హనుమంతుడి భక్తుడిని. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతికి పాల్పడుతూ కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహనం చేస్తా. అవినీతి గడీలను కూల్చివేస్తా. వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

## 36 లోనూ తగ్గేదెలే.. లేటు వయసులో సత్తాచాటుతున్న భువనేశ్వర్



క్రికెట్ ప్రపంచంలో ఫాస్ట్ బౌలర్ల కెరీర్ అనేది గాయాలు, వయస్సు ప్రభావంతో తరచూ ఒడిదుడుకులకు లోనవుతుంటుంది. ముఖ్యంగా 35 ఏళ్లు దాటిన తర్వాత ఒక పేసర్ తన వేగాన్ని, పదునును కాపాడుకోవడం అంత సులభం కాదు. కానీ, వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ 36 ఏళ్ల లేటు వయసులో ఈ అంచనాలను తలకిందులు చేస్తున్నాడు. ఐపీఎల్ 19వ సీజన్‌లో బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ బ్యాటర్లను వణికిస్తున్నాడు. టైటిల్ నిలబెట్టుకునే వేటలో ఉన్న డిఫెండింగ్ చాంప్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) బౌలింగ్ దాడిని అద్భుతంగా నడపిస్తున్నాడు. బ్యాటర్ల ధాటికి మిగతా పేసర్లు తేలిపోతున్న వేళ తన అనుభవాన్ని రంగరించి స్వింగ్ సునామీ సృష్టిస్తున్నాడు. గత నెల చివర్లో ఢిల్లీ గడ్డపై హేజిల్‌వుడ్‌తో కలిసి ఈ సీజన్‌కే హైలైట్ అనదగ్గ స్పెల్ (3/5) వేసిన భువీ ఆదివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో మరో అద్భుత ప్రదర్శన చేశాడు. ఆ మ్యాచ్‌లో పడగొట్టిన నాలుగు వికెట్లు ఆటపై తనకు ఉన్న పట్టుకు నిదర్శనంగా నిలిచాయి. ర్యాన్ రికెల్టన్‌ను లైన్‌కు అడ్డంగా షాట్ ఆడేలా పురికొల్పడం.. రోహిత్ శర్మను నకుల్ బాల్‌తో బోల్తా కొట్టించడం, సూర్యకుమార్‌ను టెస్ట్ మ్యాచ్ లెంగ్త్ బంతితో ఇబ్బంది పెట్టిన భువీ పిచ్‌ను అంచనా వేయడంలో, ప్రత్యర్థి ఆటను చదవడంలో తనకు తిరుగులేని నిరూపించాడు.

### 7.46 ఎకానమీ..

వికెట్లు తీయడమే కాకుండా, ప్రత్యర్థి జట్టును తక్కువ పరుగులకే కట్టడి చేస్తూ ఆర్‌సీబీ విజయాల్లో భువనేశ్వర్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 21 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో ముందున్నాడు. 2017 తర్వాత మెగా లీగ్‌లో భువీ సాధించిన అత్యుత్తమ గణాంకాలు ఇవే కావడం విశేషం. భువీ పడగొట్టిన 21 వికెట్లలో 10 గుడ్ లెంగ్త్ బంతులకే రావడం గమనార్హం. బ్యాటర్ల హవా నడుస్తున్న నయా జమానాలో బౌలర్లు డిఫెన్సివ్ మోడ్‌లోకి వెళ్తుంటే ఈ వెటరన్ పేసర్ మాత్రం తన స్వింగ్ బలాన్నే నమ్ముకొని సక్సెస్ అవుతున్నాడు. ఆధునిక క్రికెట్‌లో బ్యాటర్లు వైవిధ్యమైన షాట్లతో భారీ స్కోర్లు చేస్తున్నా, భువీ మాత్రం కేవలం 7.46 ఎకానమీ రేటుతో పరుగులు ఇస్తూ పొదుపుగా బౌలింగ్ చేస్తున్నాడు. వికెట్ ఏదైనా, బ్యాటర్ ఎవరైనా సరే.. బంతిని స్వింగ్ చేస్తూ ఎడ్జ్‌లు రాబడుతున్న ఈ యూపీ పేసర్ యువ బౌలర్లకు స్ఫూర్తిగా నిలుసున్నాడు.

## సన్ ఢమాల్.. 86కే కుప్పకూలిన హైదరాబాద్

- దెబ్బకొట్టిన రబాడ, హోల్డర్
- 82 రన్స్ తేడాతో గెలిచి టాప్ ప్లేస్‌కు గుజరాత్



భారీ స్కోర్లు కొడుతూ.. పెద్ద టార్గెట్లను అలవోకగా కరిగిస్తూ టాప్ గేర్‌లో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు షాక్. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై గుజరాత్ టైటాన్స్ పేసర్లు కొట్టిన దెబ్బకు ఆరెంజ్ ఆర్మీ నేలకు దిగింది. బ్యాటర్ల మూకుమ్మడి వైఫల్యంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 82 పరుగుల తేడాతో జీటీ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. ఆ జట్టు ఇచ్చిన 169 పరుగుల లక్ష్య ఛేదనలో రైజర్స్ 14.5 ఓవర్లలో 86 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ కమిన్స్ (19) టాప్ స్కోరర్. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కగిసో రబాడ (3/28), జేసన్ హోల్డర్ (3/20) దెబ్బ కొట్టారు. తొలుత సాయి సుదర్శన్ (44 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 61), వాషింగ్టన్ సుందర్ (33 బంతుల్లో7 ఫోర్లు, 1 సిక్స్‌తో 50) అర్ధశతకాలతో రాణించగా టైటాన్స్ 20 ఓవర్లకు 168/5 స్కోరు చేసింది. ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ తలోరెండు వికెట్లు పడగొట్టారు. 12 మ్యాచ్‌ల్లో వరుసగా ఐదో, ఓవరాల్‌గా ఎనిమిదో విజయంతో జీటీ టాప్ ప్లేస్‌కు దూసుకెళ్లగా.. అన్నే మ్యాచ్‌ల్లో ఐదో ఓటమితో రైజర్స్ మూడో స్థానానికి పడిపోయింది.ఐశీబతీఱర ఙవర్‌ఱఅఖ్‌ఱశీఅం

### పేస్‌కు దాసోహం

కొత్త బంతితో రబాడ, మహ్మద్ సిరాజ్ మిడిల్ ఓవర్లలో హోల్డర్ నిప్పులు చెరగడంతో హైదరాబాద్ బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. జట్టుకు వెన్నెముకలాంటి ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (0), అభిషేక్ శర్మ (6) ఘోరంగా నిరాశపరచడంతో రైజర్స్ ఏదశలోనూ ప్రత్యర్థికి పోటీ ఇవ్వలేకపోయింది. స్కోరుబోర్డుపై పరుగు చేరకుండానే సిరాజ్ తొలి ఓవర్లో హెడ్ వికెట్ కోల్పోయిన రైజర్స్‌కు రబాడ చుక్కలు చూపించాడు. పిచ్‌పై పచ్చికను సద్వినియోగం చేసుకుంటూ ఖతర్నాక్ బంతులతో రఫ్ఫాడించడంతో ఎస్‌ఆర్‌హెచ్ ఆపసోపాలు పడింది. తన వరుస ఓవర్లలోఅభి, ఇషాన్ (11), స్మరణ్ (9)ను ఔట్ చేయడంతో పవర్ ప్లే ముగిసేసరికి 34/4తో హైదరాబాద్ దిక్కుతోచని స్థితిలో నిలిచింది.



## తొలి టెస్టులో పాక్ చిత్తు

స్వదేశంలో పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ సంచలన విజయంతో సత్తాచాటింది. సొంతగడ్డపై టెస్టుల్లో ఇంతవరకూ పాక్‌ను ఓడించని ఆ జట్టు.. మంగళవారం ముగిసిన తొలి టెస్టులో 104 పరుగుల తేడాతో గెలిచి చరిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. బంగ్లా నిర్దేశించిన 268 పరుగుల ఛేదనలో పాక్.. 163 రన్స్‌కే ఆలౌటై చిత్తుగా ఓడిపోయింది. నహీద్ రాణా (5/40) ఐదు వికెట్లతో విజృంభించగా తైజుల్ ఇస్లామ్, తస్కిన్ అహ్మద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.




## వినేశ్‌ను కావాలనే అడ్డుకుంటున్నారు : సాక్షి

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)తో పోరాడుతున్న స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు సహచర క్రీడాకారిణి సాక్షి మాలిక్ మద్దతు ప్రకటించింది. మహిళాఅథ్లెట్లు బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా ఆటలో కొనసాగేందుకు ఎన్నో దేశాలు నిబంధనలు సడలిస్తుంటే.. పునరాగమనం చేస్తున్న వినేశ్ లాంటి మేటి ప్లేయర్‌ను కావాలనే అడ్డుకుంటున్నారని సోషల్ మీడియా పోస్టులో ఆరోపించింది. ఈ విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ కల్పించుకొని వినేశ్‌కు న్యాయం చేయాలని కోరింది. మరోవైపు ఈ వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదని డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ పేర్కొన్నారు. 'ఫెడరేషన్ ఒక ప్లేయర్‌ను పోటీ పడకుండా అడ్డుకోదు. ఒకవేళ అలా చేస్తుందంటే దాని వెనుక కచ్చితంగా ఓ కారణం ఉంటుంది. ప్రస్తుతం మేం ఆ మేడం (వినేశ్) సృష్టించిన అలజడిని డీల్ చేస్తున్నాం' అని చెప్పారు.



## సాత్విక్ జోడీ బోణీ

థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో నాలుగో ర్యాంకర్స్ సాత్విక్-చిరాగ్ 21-19, 21-23, 21-10తో ముహ్ పుత్రా ఎరవిన్సియా-బగస్ మౌలానా (ఇండోనేషియా) జోడీపై గెలిచారు 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్‌లో 11-16తో వెనుకబడ్డా ఆ తర్వాత వరుసగా ఏడు పాయింట్లు సాధించిన సాత్విక్ జోడీ ఆ గేమ్‌ను సొంతం చేసుకుంది. నువ్వానేనా అన్నట్టుగా సాగిన రెండో గేమ్‌లో 14-17తో వెనుకంజలో ఉండి తర్వాత పుంజుకున్నా ఇండోనేషియా షట్లర్లు పట్టు విడువకుండా ప్రయత్నించి సఫలమయ్యారు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో మాత్రం భారత జంట బ్రేక్‌కు ముందే 11-5తో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. అదే జోరుతో మ్యాచ్ గెలిచి టోర్నీలో ముందంజ వేసింది.







## రెండు సార్లు ఆ హీరోతో నటించే ఛాన్స్ మిస్ చేసుకున్నా.. అసలు విషయం చెప్పిన ఇంద్రజ

తెలుగు చిత్రసీమలో అందాల తార ఇంద్రజ తన కెరీర్ ప్రయాణంలో మెగాస్టార్ చిరంజీవి గారితో కలిసి పనిచేసే అవకాశం రెండుసార్లు తృటిలో చేజార్చుకున్న తీరును ఇటీవల జరిగిన ఒక ఓ ఇంటర్వ్యూలో తెలిపారు . తన సినీ ప్రస్థానంలో చిరంజీవితో ఒక పాటలోనైనా డాన్స్ చేయాలనే తన బలమైన కోరిక ఇప్పటికీ తీరలేదని ఆమె అన్నారు. ఇంద్రజ మాట్లాడుతూ..

చిరంజీవితో వచ్చిన మొదటి అవకాశం ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన అల్లుడ మజాకా చిత్రంలో సిస్టర్ క్యారెక్టర్. చిరంజీవితో స్క్రీన్‌పై కలిసి డాన్స్ చేయాలనే తన ఆశయానికి సిస్టర్ పాత్ర అడ్డుపడుతుందని భావించి, ఆ పాత్రను సున్నితంగా తిరస్కరించారట. ఆతర్వాత, ఆ పాత్రను నటి ఊహ పోషించారు. ఒకవేళ సిస్టర్ గా నటిస్తే చిరంజీవితో రొమాంటిక్ లేదా డాన్స్ పార్ట్‌నర్‌గా నటించే అవకాశాలను దూరం చేస్తుందని ఆమె భావించారట. రెండో అవకాశం ఎడిటర్ మోహన్ నిర్మించిన హిట్లర్ చిత్రంలో వచ్చింది. ఈ చిత్రంలో నటుడు రాజేంద్ర ప్రసాద్ పక్కన ఒక ముఖ్యమైన పాత్రలో నటించాల్సింది. అయితే, అప్పట్లో ఆమె తమిళంలో రాంకీతో కలిసి తడయం చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నారట. విజయశాంతి స్వంత నిర్మాణ సంస్థలో రూపొందిన ఆ చిత్రం కారణంగా, హిట్లర్ సినిమాలో అవకాశం కూడా ఆమె చేతి నుంచి జారిపోయిందని తెలిపారు ఇంద్రజ. చిరంజీవితో ఒక సినిమా అయినా చేయాలనే ఆశ ఇంకా సజీవంగా ఉందని, దురాశ కాదని, కేవలం ఒక డాన్స్ పాటలో అయినా ఆయనతో కలిసి నటించాలనే కోరిక ఉందని ఆమె స్పష్టం చేశారు. చిరంజీవిని "డాన్స్ అంటే చిరు గారు" అని ఆమె అన్నారు. చిరంజీవి నుంచి తాను నేర్చుకున్న అతి ముఖ్యమైన విషయం ఆయన మాట్లాడే విధానం అని ఇంద్రజ అన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020